
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 7 మే 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36 (మంగళవారం)
కనిష్ఠం : 27

కొత్త రేషన్‌కార్డులకు పచ్చజెండా!



- నేటి నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు
- స్మార్ట్ రేషన్‌కార్డుల విడుదలకు ప్రభుత్వ యోచన
- ఎట్టకేలకు పేద ప్రజలకు ఊరట

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. కొత్త రేషన్‌కార్డుల కోసం బుధవారం నుంచి దరఖాస్తులు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దాంతో జిల్లావ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా ఉంది. సివిల్ సప్లయిస్‌శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణకు, కొత్త కార్డుల్లో మార్పులు, చేర్పులతోపాటు చిరునామా మార్చుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 3.28 లక్షల దరఖాస్తులు రేషన్‌కార్డుల మార్పుకోసం వచ్చాయి. వీరికి క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డు జారీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆరు నెలల రేషన్ వివరాలు తెలుస్తాయి. ప్రభుత్వం కొత్తగా ఇచ్చే స్మార్ట్‌కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు స్పష్టంగా ఉంటాయి. ఈ కార్డుతో దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తున్నారు. కొత్త రేషన్‌కార్డు పొందేందుకు నెల రోజులు గడువు ఇస్తూ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల రేషన్‌కార్డులను ఈకేవైసీ చేసే ప్రక్రియ ఏప్రిల్ నెలాఖరుతో ముగిసింది. అయితే ఈ గడువును జూన్ 30వ తేదీ వరకు పొడిగించడంతో ఇప్పటివరకు ఈకేవైసీ చేసుకోని వారందరికీ మరో అవకాశం లభించినట్టు అయింది. కాగా జిల్లాలో 15.25 లక్షల కుటుంబాలకు చెందిన లబ్ధిదారులు ప్రభుత్వం నుంచి నిత్యావసర వస్తువులు తీసుకుంటున్నారు. కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేస్తే ఈ సంఖ్య మరింత అధికంగా పెరుగుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం అమలుచేస్తున్న సూపర్-6 పథకాల్లో అర్హత సాధించాలంటే రేషన్‌కార్డు తప్పనిసరి అనే నిబంధన ఉండడంతో కొత్తరేషన్‌కార్డుల జారీకోసం జిల్లాలో వేలాది కుటుంబాల వారు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. నెలరోజులపాటు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగిన తరువాత వెరిఫికేషన్ పూర్తిచేసి ప్రభుత్వం నూతనంగా విడుదల చేయనున్న స్మార్ట్ కార్డు రూపంలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు జారీచేస్తారు. కొత్తగా జారీచేసే కార్డులకు దరఖాస్తులతోపాటు గతంలో ఉన్న కార్డుల్లో సభ్యుల తొలగింపు, లేదా చేర్పులు, విభజించాల్సిన కార్డులు, ప్రభుత్వానికి అప్పగించిన కార్డులు, అడ్రస్ మార్పులు వంటి ఇతర సమాచారాన్ని కూడా మార్పు చేసుకునే వీలుంది. ఈ అవకాశాన్ని అర్హులంతా వినియోగించుకోవాలని సివిల్ సప్లయిస్ శాఖ అధికారులు కోరారు.

మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

- ఇప్పటివరకు 1.02 లక్షా మెట్రిక్ టన్నుల సేకరణ
- తేమశాతం ఉన్నా తరుగుతో ధాన్యం సేకరణ
- జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి వెల్లడి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): రబీ ధాన్యం సేకరణలో గతంలో నిర్దేశించిన లక్ష్యం కంటే అదనంగా లక్ష టన్నులు ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి వెల్లడించారు. కోనసీమ జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గతంలో 2 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా నిర్ణయించారని, అయితే ప్రభుత్వం మరో లక్ష టన్నులు కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆమె పేర్కొన్నారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్సు హాలులో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుత రబీ సీజన్‌లో 34 శాతం మేర అంటే 2 లక్షల టన్నులు టార్గెట్‌గా నిర్ణయించడం జరిగిందని, అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా అధికారులు, మిల్లర్లతో మాట్లాడి టార్గెట్‌లు పెంచాలన్న అభ్యర్థన మేరకు కోనసీమ జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలిపారన్నారు. ఈ టార్గెట్‌లో 40వేల మెట్రిక్ టన్నుల బాయిల్డ్‌రైస్, 60 వేల మెట్రిక్ టన్నుల రా రైస్ సేకరణ లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఆర్ఎస్‌కేల ద్వారా లక్షా 2వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించి 24 గంటల్లోపు ధాన్యం సొమ్ములను వారి ఖాతాలకు జమ చేస్తున్నట్టు చెప్పారు. మిల్లర్ల బ్యాంకు గ్యారంటీలను కూడా 1:2 గా నిర్ణయించినట్టు చెబుతూ ఉదాహరణకు రూ.కోటి బ్యాంకు గ్యారంటీ ఇస్తే రూ.2 కోట్ల మేర విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు జేసీ తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు నష్టం కలగకుండా ఉంటేందుకు వీలుగా, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు, సందేహాలుంటే జిల్లాస్థాయిలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్ 8309432487, 9441692275లను సంప్రదించి పరిష్కరించుకోవాల్సిందిగా జేసీ సూచించారు. అలాగే ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తేమశాతం 17 ఉంటే కనీస గిట్టుబాటు ధరను చెల్లిస్తారని, 18 శాతం ఉంటే ఒక కిలో, 19ఉంటే 2 కిలోలు, 20 ఉంటే 3 కిలోలు, 21 ఉంటే 4 కిలోలు, 22ఉంటే 5 కిలోలు, అంతకంటే ఎక్కువ ఉన్నా ఐదు కిలోలు మాత్రమే తరుగులను విధించాలని మిల్లర్లను ఆదేశించినట్టు చెప్పారు. బొండాలు రకానికి బహిరంగ విపణిలో డిమాండ్ ఉన్న దృష్ట్యా ఆర్ఎస్‌కేల ద్వారానే విక్రయించుకోవాల్సిందిగా సూచించారు.

ఉచిత గ్యాస్ బుక్ చేసుకోండి..

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండో దశలో గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా అందిస్తున్నారని, తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాన్ని వినియోగించుకోవాలని జేసీ నిషాంతి కోరారు. ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు తమ పర్యటనలో ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీపం-2 కింద రెండో దశ కొనసాగుతుందని, సిలిండర్ పొందేందుకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల సంతృప్తి స్థాయిలను ఐవీఆర్ఎస్ పోర్టల్ ద్వారా లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం అభిప్రాయం కోరుతోందని, పథకాల అమలులో జిల్లాను ముందంజలో ఉంచాలని కోరారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.ఉదయ్‌భాస్కర్, జిల్లా మేనేజర్ ఎం.బాలసరస్వతి, అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాన్సర్ కలవరం!



- వేలల్లో అనుమానిత కేసులు
- 2.0 సర్వేలో 16,432
- 3.0. సర్వేలో 21వేలుపైనే
- కాకినాడలోనే 8,383 కేసులు
- 21 మందికి క్యాన్సర్ నిర్ధారణ
- రాష్ట్రంలోనే కాకినాడ జిల్లా ఫస్ట్
- ఆసుపత్రి ఏర్పాటు యోచన
- రూ.10 కోట్లతో ప్రతిపాదనలు
- కాకినాడ కలెక్టర్ చొరవ
- క్యాన్సర్ పరీక్షలకూ వాహనం

ఉమ్మడి జిల్లాలో విజృంభిస్తోన్న మహమ్మారి

క్యాన్సర్.. ఎప్పుడు వస్తుందో.. ఎక్కడ వస్తుందో.. ఎలా వస్తుందో తెలియదు.. ఏదో అనుమానం ఉంటే తప్ప ప్రాథమిక దశలో గుర్తించడం కూడా కష్టమే. నూటికి 50 నుంచి 60 శాతం కేసులు చివరిలోనే గుర్తిస్తారు.. దాంతో సకాలంలో చికిత్స అందక క్యాన్సర్‌కు ఎందరో బలైపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిపిన సర్వే విస్తుపోయే నిజం బయటకు వచ్చింది.. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి విజృంభిస్తోందని తేలింది.. కాకినాడ క్యాన్సర్ అనుమానిత కేసుల్లో తొలిస్థానంలో ఉంటే.. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలు 10, 11వ స్థానాల్లో ఉండడం కలవరపెడుతోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్యాన్సర్ అనుమానిత కేసులు కలవరపెడుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ సర్వేలో వేలకు వేలు అనుమానిత కేసులు వెలుగులోకి వస్తున్నాయి. ఏ మండలంలో చూసినా నోటి, సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న బాధితులు ఎక్కువగా తేలుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌సీడీ (నాన్ కమ్యునబుల్ డిసీజ్) 2.0 సర్వేలో ఉమ్మడి జిల్లాలో 16,432 మందిలో క్యాన్సర్ అనుమానిత లక్షణాలు గుర్తించగా తాజాగా పూర్తయిన ఎన్‌సీడీ 3.0 సర్వేలో ఏకంగా 20వేలకుపైగా కేసులు వెలుగులోకి రావడం క్యాన్సర్ తీవ్రతను చాటుతోంది.

అంతకంతకూ విజృంభణ..

రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో క్యాన్సర్ కేసులు విజృంభిస్తున్నాయి. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా క్యాన్సర్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం జనవరిలో ఆదేశించింది. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇంటింటికీ వెళ్లి ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది క్యాన్సర్ తోపాటు పలు రకాల వ్యాధులపై సర్వే చేశారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్, లివర్ వ్యాధులు సైతం భారీగా ఉమ్మడి జిల్లాలో వెలుగులోకి వస్తున్నా వీటికి మించి భయపెట్టేలా క్యాన్సర్ అనుమానిత కేసులు గుర్తిస్తుండడం కలవరపాటుకు గురిచేస్తోంది.

రాష్ట్రంలో కాకినాడ ఫస్ట్..

కాకినాడ జిల్లాలో అత్యధికంగా కేసులు ఉండడం కలవరపెడుతోంది. 2.0 సర్వేలో కాకినాడ జిల్లాలో 6,333 కేసులు గుర్తించారు. 3.0 సర్వేలో ఏకంగా 8,383 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటివరకు వీరిలో చాలామందికి పూర్తిస్థాయి టెస్టులు చేయగా 21 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. ఇన్ని కేసులతో కాకినాడ జిల్లా రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచింది. ఈనేపథ్యంలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. నిధులు వేగంగా విడుదలచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎస్సార్ నిధుల ద్వారా ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు జరిపే మొబైల్ వాహనాన్ని కూడా అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఓఎన్జీసీతో మాట్లాడారు. ఈ మొబైల్ వాహనం ద్వారా రోజుకు వెయ్యిమందికి టెస్టులు చేసే ఆధునిక పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మందికి టెస్టులు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. తూర్పుగోదావరి జిల్లా 5,103 అనుమానిత క్యాన్సర్ కేసులతో పదో స్థానంలో నిలిచింది. కోనసీమ జిల్లా 4,996 కేసులతో 11వ స్థానంలో నిలిచింది. ఉమ్మడి జిల్లాలో ఎన్‌సీడీ 2.0 సర్వేలో క్యాన్సర్ అనుమానిత కేసులు 16,432 తేలాయి.

ఉమ్మడి జిల్లాలో అనుమానితులు 21 వేలు

- గత మార్చిలో ప్రభుత్వం మూడో దశ ఎన్‌సీడీ సర్వే చేపట్టింది. ఈ సర్వేలోనూ క్యాన్సర్ అనుమానిత కేసులు ఉమ్మడి జిల్లాలో ఏకంగా 21 వేలు గుర్తించారు. కాకినాడ జిల్లాలో అయితే 3.0 సర్వేలో ఏకంగా 8,383 అనుమానిత కేసులు గుర్తించారు. ఓరల్ క్యాన్సర్ విభాగంలో 3,995, బ్రెస్ట్ క్యాన్సర్ విభాగంలో 2,337, సర్వైకల్ క్యాన్సర్ విభాగంలో 2,051 మంది అనుమానితులుగా గుర్తించారు. వీరిని కాకినాడ జీజీ హెచ్‌కు రిఫర్ చేశారు. ఇలా ఓరల్ క్యాన్సర్ పరీక్షలకు పంపిన 56 మందిలో 12 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న 78 మందిలో ఐదుగురికి క్యాన్సర్‌గా తేలింది. సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న 21 మందిలో నలుగురికి వ్యాధి నిర్ధారణ అయింది.
- తూర్పుగోదావరి జిల్లాలో 6,413 మందిలో అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. ఓరల్ క్యాన్సర్ విభాగంలో 3,186 అనుమానిత కేసులు గుర్తించగా లోతైన వైద్య పరీక్షలకు 44 మందిని రాజమహేంద్రవరం జీజీహెచ్ అంకాలజీకి రిఫర్ చేశారు. బ్రెస్ట్ క్యాన్సర్ విభాగంలో 1,800 అనుమానిత కేసులుండగా 97 మందిని లోతైన టెస్టులకు రిఫర్ చేశారు. సర్వైకల్ క్యాన్సర్ విభాగంలో 1,427 అనుమానితులను గుర్తించగా 24 మందిని జీజీహెచ్‌కు పంపారు. ఈ అనుమానిత కేసుల్లో నలుగురికి బ్రెస్ట్ క్యాన్సర్, మరో నలుగురికి ఓరల్ క్యాన్సర్ నిర్ధారణ అయింది. మిగిలిన వారికి పరీక్షలు జరుగుతున్నాయి.
- కోనసీమ జిల్లాలో ఎన్‌సీడీ 2.0 సర్వేలో 4,996 కేసులు గుర్తించగా తాజా సర్వేలో ఐదు వేలకుపైగా అనుమానితులను గుర్తించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనుమానిత కేసులు, నిర్ధారణ అవుతున్న కేసులు అంతకంతకూ పెరుగుతున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వివరించారు. బాధితుల్లో ఎక్కువగా 40 నుంచి 64 ఏళ్ల మధ్య వయసున్న వారు అధికంగా ఉంటున్నారని తేలింది.


బలభద్రపురంలో క్యాన్సర్ పరీక్షలు (ఫైల్)

అసెంబ్లీ వేదికగా బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. సుమారు ఆ ఒక్కగ్రామంలో 40 మంది క్యాన్సర్ బాధితులను గుర్తించి ఆసుపత్రులకు తరలించారు. ఆ గ్రామంలో కేసులు వేలల్లో ఉంటాయని వాదన.

రూ.10 కోట్లతో ఆసుపత్రి..

క్యాన్సర్ విజృంభణ కారణంగా కాకినాడలో ప్రత్యేకంగా క్యాన్సర్ ఆసుపత్రి నిర్మించాల్సి ఉందని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ మేరకు రూ.10 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపారు. ఆస్పత్రి నిర్మాణానికి స్థలం జీజీహెచ్‌కు సమీపంలో ఉందని నివేదికలో వివరించారు. కాకినాడ జీజీహెచ్ అంకాలజీ విభాగంలో నిపుణులైన క్యాన్సర్ వైద్యులు ఉన్నారన్నారు. నిధులు విడుదల చేయాలని కోరారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తారు. అనుమానితులు వెళ్లి పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంది. ఈ కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉంటారు. పరీక్షించి వెంటనే ఫలితం చెబుతారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

టీడీపీ గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న అల్లాడ


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అముడా చైర్మన్ అల్లాడ

అమలాపురం, మే 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పార్టీపరంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు ప్రజలు పోటెత్తుతున్నారని అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు పేర్కొన్నారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో స్వామినాయుడు పాల్గొని ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి వినతులు తీసుకున్నారు. వాటి పరిష్కారంకోసం ప్రభుత్వానికి నివేదిస్తామని స్వామినాయుడు తెలిపారు.





ముమ్మిడివరంలో ఆర్అండ్‌బీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బుచ్చిబాబు.. నగర పంచాయతీ పరిధిలోని రెడ్డివారిపాలెంలో ఎంపీ, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న గ్రామస్తులు

కోనసీమ వాసులకు రైలు కూత వినిపిస్తాం!

ఎంపీ గంటి హరీష్‌మాధుర్.. ముమ్మిడివరంలో పలు శంకుస్థాపనలు.. హాజరైన ఎమ్మెల్యే దాట్ల

ముమ్మిడివరం, మే 6(ఆంధ్రజ్యోతి): కోనసీమవాసుల చిరకాల వాంఛ అయిన రైల్వే లైన్ ఏర్పాటుచేసి రానున్న నాలుగేళ్లలో రైలు కూత వినిపిస్తామని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. ముమ్మిడివరంలో నిర్మించిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఎంపీ, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి పాల్గొన్నారు. మండలం, నగర పంచాయతీ పరిధిలో రూ.2 కోట్ల 75లక్షల 69వేలతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, రూ.48లక్షల 56వేలతో నిర్మించనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ముమ్మిడివరంలో రూ. కోటి 68 లక్షలతో నిర్మించిన కొండాలమ్మచింత, బాలయోగి ఆశ్రమం ఆర్అండ్‌బీ రోడ్డును వారు ప్రారంభించారు. అలాగే తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద టీటీఆర్ నగర్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పలుచోట్ల ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ప్రారంభించారు. అలాగే మంచినీటి ట్యాంకులను కూడా ప్రారంభించారు. రెడ్డివారిపాలెంలో గ్రామస్తులు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ ఎంతో కాలంగా ఈ ప్రాంత వాసులు ఎదురుచూస్తున్న రైల్వే లైన్ తమ హయాంలో పూర్తి చేస్తామన్నారు. రైల్వేలైన్‌కు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లింపులో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగలేదన్నారు. కేంద్రం నుంచి వచ్చే అధిక నిధుల్లో అధిక శాతం ముమ్మిడివరం నగర పంచాయతీ అభివృద్ధికి కేటాయిస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. జాతీయ రహదారి విస్తరణకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన ఎమ్మెల్యే అవగాహనలోపం కారణంగా ముమ్మిడివరం నగర పంచాయతీని నగర పంచాయతీగా మార్పుచేయడం వల్ల ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. ఇక్కడ ప్రజలకు ఉపాధిహామీ పథకం లభించకుండా పోయిందన్నారు. ఎంపీ ఇచ్చిన రూ.50 లక్షల నిధులు నగర పంచాయతీ అభివృద్ధికి కేటాయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొండాలమ్మచింత ఆలయం నుంచి రెడ్డివారిపాలెం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లి ఎంపీ, ఎమ్మెల్యేలను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అలాగే ముమ్మిడివరం మండలం అన్నంపల్లిలో బీసీ, ఈడబ్ల్యుఎస్ మహిళలకు కుట్టుమిషను ట్రైనింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గాడిలంకలో రూ.కోటి 10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీడీఈవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కుట్టుశిక్షణ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే సోమిదేవరపాలెంలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, అర్ధాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, దాట్ల పృథ్వి, కాకర్లపూడి రాజేష్, సాగి సూరిబాబురాజు, ఎంపీపీ కోలా గంగాభవానీ, కమిషనర్ పి.రవివర్మ, గుద్దటి జమ్మి, దాట్ల బాబు, గొల్లపల్లి ధర్మారావు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, గోదశి పుండరీష్, కర్రా దుర్గాప్రసాద్, మాదాల శ్రీధర్, దూడల స్వామినాయుడు, సరిపెల్ల శ్రీనివాసరాజు, యాళ్ల ఉదయ్, నడింపల్లి శ్రీనివాసరాజు, ములపర్తి బాలకృష్ణలు పాల్గొన్నారు.

వాహనిజం.. ఇతగాడి మేనరిజం!

విభిన్న వాహనాలతో ఆకట్టుకుంటున్న నక్కిడిలంక యువకుడు 6



మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి మృత్యువాత

గోదావరిలో స్నానానికి దిగి ఇద్దరు యువకుల మృతి

కపిలేశ్వరపురం మండలం వీధివారిలంకలో దుర్ఘటన 7


కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గోదావరి వద్ద ఘటనా స్థలంలో పోలీసులు


ద్వారపూడిలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారిణి శాంతిలక్ష్మి

గ్రామాల్లో చెత్తను ఎరువుగా మారుస్తాం : డీపీవో

మండపేట, మే6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్త ద్వారా సేంద్రియ ఎరువును తయారుచేసి సంపద సృష్టించడమే పంచాయతీల లక్ష్యం కావాలని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతిలక్ష్మి చెప్పారు. మండపేట మండలం ద్వారపూడి, కేశవరం, ఏడిద గ్రామాల్లో ఆమె మంగళవారం పర్యటించి చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్త సంపద కేంద్రాల నిర్వహణ వివరాలను ఆమె స్థానిక పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో చెత్త ఎక్కడైనా రోడ్డుపక్కగాని, ఇళ్ల ముందుగానీ కనిపిస్తే చర్యలు తప్పవని ఆమె సిబ్బందిని హెచ్చరించారు. ఇంటింటా చెత్త సేకరణ బాధ్యతను హరితరాయబారులకు అందించాలని ఆమె పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఇక నుంచి ప్రతివారం సోమవారం నుంచి శుక్రవారం వరకు తడి చెత్తను శని, ఆదివారం రోజుల్లో పొడిచెత్తను వేరుచేసి అందించాలని ఆమె కోరారు. ఇక నుంచి గ్రామాల్లో ఎక్కడ చెత్త కనిపించినా సహించేదిలేదన్నారు. పంచాయతీల్లో ఉత్పత్తి అయ్యే సేంద్రియ ఎరువును మార్కెటింగ్ చేసే అంశం ప్రభుత్వం పరిశీలనలో ఉందన్నారు. డీపీవోకు షెడ్ల నిర్వహణ గురించి ద్వారపూడి, కేశవరం, ఏడిద పంచాయతీ కార్యదర్శులు, ఏవీవీ రమణ, సుబ్బారావు, శ్రీనివాస్‌లు వివరించారు. అనపర్తి ఐటీసీ సంస్థ అందించిన కిట్‌లను పంపిణీ చేశారు.

నేటి నుంచే సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాలు 7

వాహ్వా నిజం!
ఇతగాడి మేనరిజం


డబుల్ సైకిల్‌పై సవారీ..


కారుగా మారిపోయిన యాక్టివా...

కలలు కనండి..వాటిని నిజం చేసుకోండి.. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన మాట.. ఆ మాటను ఆచరించే యువత కోకొల్లలు.. ఆ కోవలోకే వస్తాడు రాజ్‌కుమార్.. పుట్టింది కుగ్రామంలో అయినా చిన్నతనం నుంచి ఏదో ఒకటి కొత్తగా చేయాలనే తపన.. అందులో నుంచి పుట్టిందే విభిన్న ఆకారాల్లో వాహనాల రూపకల్పన.. చిన్నతనం కార్లు అంటే చాలా ఇష్టం.. అది మామూలు కార్లు కాదండోయ్.. ఇటీవల కల్కి సినిమాలో బుజ్జి కారు చూశారా.. అలా ఉండాలి.. మరి అటువంటి కార్లు మార్కెట్‌లో లభ్యమవుతాయా.. కష్టమే కదా.. ఉన్నా కొనలేం. అందుకే తన బుర్రకే పదును పెట్టాడు.. ఇదిగో ఇలా తన వద్ద ఉన్న పరికరాలతోనే తనకు నచ్చినట్టు వాహనాలు తయారుచేసుకుని అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు.. యూట్యూబ్ చానల్ వేదికగా వీక్షకులతో శెహబాష్ అనిపించుకుంటున్నాడు.. - పి.గన్నవరం-ఆంధ్రజ్యోతి

సోషల్ మీడియా నేటి తరం యువతకు ఒక అద్భుత వేదిక.. వారిలో ఉన్న టాలెంట్‌ను ఎవరూ గుర్తించనక్కర్లేద్దు.. వారే గుర్తించి.. అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా యువత ఇదే చేస్తున్నారు. వారి నైపుణ్యాలను వివిధ రకాలుగా ప్రదర్శిస్తున్నారు. కొందరు వీడియో లు తీసి సోషల్‌మీడియా ద్వారా తమ ప్రతిభను ప్రపంచానికి తెలియజేస్తున్నారు. ఇటీవల కాకినాడకు చెందిన అమ్మాయి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుల ద్వారా పాపులరై కోర్టు సినిమాలో హీరోయిన్ క్యారెక్టర్ కొట్టేసింది. కోనసీమ జిల్లా సరిహద్దులోని ఆచంట మండలం నక్కిడిలంక యువకుడు రాజ్‌కుమార్.. పరిసరాల్లో దొరికే వస్తువులతో వింతవాహనాలు తయారుచేస్తూ ఆ వీడియోలను యూట్యూబ్‌లో ఔరాఅనిపిస్తున్నాడు.



- పల్లెటూరులో కొత్త..కొత్తగా..షికారు!
- విభిన్న ఆకారాల్లో వాహనాల రూపకల్పన
- చేసింది డిప్లమో అయినా వినూత్నంగా ఆలోచన
- వీక్షకులను ఆకట్టుకుంటున్న నక్కిడిలంక యువకుడు
- 'కోనసీమ సరదాలు' పేరుతో యూట్యూబ్ ఛానల్

గల్ఫ్ వెళ్లొచ్చి..

కోనసీమజిల్లా సరిహద్దు ప్రాంతానికి చెందిన ఆచంట మండలం గోదావరి మధ్యలోని గ్రామం నక్కిడిలంక.. అక్కడ ఒక గ్రామం ఉందని బయట ప్రపంచానికి తెలియడం చాలా అరుదు.. ఎందుకంటే లంక గ్రామం కావడంతో పరిసర గ్రామాల వారికే అవగాహన ఉంటుంది.ఆ గ్రామానికి చెందిన యువకుడు రాజ్‌కుమార్ వినూత్న వాహనాల రూపకల్పన చేసి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. అమలాపురం బీవీసీ కళాశాలలో డిప్లమో పూర్తి చేసి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి పోయాడు. తిరిగి వచ్చిన తర్వాత తనకు ఉన్న నైపుణ్యంతో వినూత్న వాహనాలను తయారు చేసి యూట్యూబ్ ద్వారా ప్రపంచానికి చూపించాలన్న ఆలోచనతో ఇటీవలే 'కోనసీమ సరదాలు' పేరుతో ఛానల్ ప్రారంభించాడు. సాంకేతిక పరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని తనకు ఉన్న పరిజ్ఞానంతో తన ప్రయత్నాన్ని సఫలం చేసుకుంటున్నాడు.


యువకుడు తయారు చేసిన వెదురుబొంగుల పడవ

కొత్తకొత్తగా ఇలా..

తన స్నేహితుడు మనోజ్ సాయంతో రాజ్‌కుమార్ ఇప్పటి వరకు నాలుగు వినూత్న వాహనాలు తయారు చేశాడు. ఎదురుబొంగులు, ప్లాస్టిక్ కవర్ల సాయంతో పడవను తయారు చేసి వశిష్ట నదీ పాయలో విహారం చేశాడు. ఒక సైకిల్‌పై మరో సైకిల్‌ను జోడించి వాటి మధ్య వెల్డింగ్‌తో ఎత్తయిన సైకిల్‌గా రూపకల్పన చేసి గ్రామంలోని రోడ్లపై తొక్కాడు. ఒకేసారి ఐదుగురు ప్రయాణం చేసేలా పొడవాటి స్కూటీని తయారు చేసి సీసీ రోడ్లపై ప్రయాణం చేశాడు. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి స్కూటీ సాయంతో బగ్గీ వాహనం(చిన్నకారు) తయారు చేసి రోడ్డుపైకి వచ్చాడు. వాహనాల తయారీలో వెల్డింగ్ దగ్గర నుంచి బిగించే వరకు అన్నీ అతడే స్వయంగా చేసుకోవడం విశేషం. ఒక్కసారి చేసిన వాహ నాన్ని తన యూట్యూబ్ కోసం వీడియో చేసిన తర్వాత నిర్వీర్యం చేస్తాడు.ఆ వస్తువులనే మళ్లీ నూతన వాహనం తయారీకి వినియోగిస్తాడు. ఇలా అద్భుతంగా తీర్చిదిద్దుతాడు. వాహనాలపై పల్లె రోడ్లపై తిరుగుతూ రీల్స్ చేసి వాహ్వా అనిపించుకుంటున్నాడు.

పనిలోనే ఆనందం వెతుక్కుంటున్నా : రాజ్‌కుమార్



నాకు చిన్నతనం నుంచి వాహనాలంటే చాలా ఇష్టం.. ఎక్కడైనా కొత్త వాహనాలు కనిపిస్తే తరచి తరచి చూడడం అలవాటు..చిరంజీవి పాత సినిమాల్లో చూస్తే చాలా వాహనాలు కనిపించేవి.. వాటిని మైండ్‌లో పెట్టుకునేవాడిని.ప్రస్తుతం నా వాహనాలకు అదే ప్రేరణ.. పాత వాహనం తీసుకుని దాన్ని రీమోడల్ చేస్తా. డిప్లమో అయిన తర్వాత ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిపోయా. అక్కడ పనిచేసేవాడినే కానీ ఏదో తెలియని వెలితి.. ఎందుకొచ్చిన గొడవ అని వచ్చేశా.. నా టాలెంట్‌నే పెట్టుబడిగా పెట్టి వాహనాలు తయారుచేస్తున్నా.. ఆనందంగా ఉంది.


ఇది లోకల్ మేడ్ వాహనం.. ఎలా ఉందో చూశారా.. ఐరన్ బద్దలు.. యాక్టివా ఇంజన్.. టైర్లు అమర్చి ఐదుగురు ప్రయాణించేలా వాహనం ఇలా..



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో యువతీయువకుల సాధన

శారీరక బలం, చురుకుదనం, నైపుణ్యంతో
మీరే మేటి అథ్లెట్



ఏ దేశానికైనా యువతే ప్రధాన వనరు. అలాంటి యువత ఆరోగ్యం, ఆలోచనా విధానాన్ని తీర్చిదిద్దేదే క్రీడ. ఏ క్రీడలోనైనా ప్రావీణ్యం సాధించడానికి మౌలికంగా అవసరమయ్యే శక్తి, సామర్థ్యాలకు పర్యావరణ పరిరక్షణ తోడైతే ఆ దేశ ఖ్యాతి ఇనుమడిస్తుంది. పురాతన ఒలింపిక్ క్రీడల్లో అగ్ర భాగం జంప్, జావెలిన్, డిస్కస్‌త్రో పాటు పరుగుదే. బాక్సింగ్, రథాల పోటీలతో పాటు మల్లయుద్ధం ఉండేవి. ప్రపంచ క్రీడా వేదికైన ఆధునిక ఒలింపిక్స్‌లో పతకం సాధించడం ప్రతి క్రీడాకారుడి కల. ఒలింపిక్స్‌లో సైతం అత్యధిక పతకాలు (48 బంగారు) అథ్లెటిక్స్‌లోనే అందిస్తారు.

నేడు ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం

కార్పొరేషన్ (కాకినాడ), మే 6 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడ మొదలైందే అథ్లెట్‌గా అంటే అతిశయోక్తి కాదు. మానవ పరిణామక్రమంలో మనిషి రెండు కాళ్లతో నడవడం ప్రారంభించాడు. మెరుగైన జీవనం కోసం పరుగెత్తాడు. ఆహార అన్వేషణలో భాగంగా విసిరాడు.. దుమికాడు. ఇవన్నీ మనిషి జీవన గమనాన్ని ఊహించలేని స్థితికి చేర్చాయి. నడవడం, పరుగెత్తడం, దుమకడం, విసరడం అనేవి అథ్లెటిక్ ట్రాక్, ఫీల్డ్ అంశాలైనా.. ప్రతి క్రీడలోనూ ప్రాథమిక అంశాలు. క్రీడాకారుడి (అథ్లెట్)గా ఎదిగేందుకు శిక్షణలో శారీరక బలం, చురుకుదనం, నైపుణ్యం ప్రధాన పాత్ర పోషిస్తాయి. అలాంటి అథ్లెట్‌గా పిల్లలు, యువతలో ఫిట్‌నెస్ ప్రాముఖ్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ప్రతిఏటా మే 7న ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం జరుపుకుంటున్నాము. 1996లో తొలిసారిగా ప్రపంచ అథ్లెటిక్స్ డేను అంతర్జాతీయ అథ్లెటిక్ అమెచ్యూర్ సమాఖ్య ప్రారంభించింది.

క్రీడలు మానసిక స్థితి, ఏకాగ్రత, నిద్ర అలవాట్లను మెరుగుపరుస్తుంది. ఒత్తిడి, నిరాశను తగ్గిస్తుంది. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఇది నాయకత్వ లక్షణాలతో ముడిపడి ఉంది. వృద్ధులకు మానసిక ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది.

1985 ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పీటీ ఉష ఐదు బంగారు పతకాలు సాధించింది. కామన్‌వెల్త్ క్రీడల్లో మిల్కాసింగ్ స్వతంత్ర భారతదేశానికి మొట్టమొదటి స్వర్ణ పతకం సాధించాడు. సియోల్ ఆసియా క్రీడల్లో పీటీ ఉష ఒక రజతం, నాలుగు బంగారు పతకాలను గెలుచుకుంది. 2018 ప్రపంచ యు-20 చాంపియన్‌షిప్‌లో హిమాదాస్ స్వర్ణం గెలుచుకున్నారు. యూనివర్శియేట్‌లో స్వర్ణం గెలిచిన తొలి భారతీయురాలిగా ద్యుతీచంద్ నిలిచారు.



ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం లక్ష్యాలు

- యువతలో క్రీడలను ప్రాచుర్యం పొందడం. అథ్లెటిక్స్‌కు ప్రోత్సాహం ఇవ్వడం.
- పాఠశాలలు, సంస్థల్లో దానిని ప్రాథమిక క్రీడగా మార్చడం.
- క్రీడల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం, క్రీడల ప్రాముఖ్యత, యువతకు విద్యను అందించడం.
- యువత, క్రీడ, పర్యావరణ పరిరక్షణ మధ్య ఒక ముఖ్యమైన సంబంధాన్ని ఏర్పరచడం.



అథ్లెటిక్స్‌కి మంచి రోజులు వచ్చాయి



మన దేశంలో అథ్లెటిక్స్‌కి మంచి రోజులు వచ్చాయి. నేను 1994 నుంచి 1997 వరకు జూనియర్ ఇండియా టీమ్ కోచ్‌గా పని చేశాను. అప్పటికి, ఇప్పటికి చూస్తే సింథటిక్ ట్రాక్‌లు చాలా వచ్చాయి. మంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వుంది. కానీ కోచ్‌లు చాలా తక్కువ వున్నారు. 1990లో ప్రతి జిల్లాకి ఒక కోచ్ ఉండేవారు. ఎస్ఏఐ కోచ్‌లు ఉండేవారు. అప్పట్లో అథ్లెటిక్స్ ప్రాక్టీస్ చేసేవారు ఎక్కువ. ప్రస్తుత ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. పూర్వం తరహాలో స్పోర్ట్స్ హాస్టల్స్, అకాడమీలు రానున్నాయి. రాష్ట్రంలో సింథటిక్ ట్రాక్‌ల సంఖ్య పెరగనుంది. కాకినాడ జేఎన్టీయూలో సింథటిక్ ట్రాక్ రెడీ అవుతోంది. జిల్లా క్రీడా మైదానంలో కూడా ట్రాక్‌కి ప్రతిపాదనలను కలెక్టర్ అప్రూవల్‌తో ఖేలో ఇండియా స్కీమ్ కింద పం పించాము. బేసిక్ లెవెల్లో క్రీడాకారులు అథ్లె టిక్స్‌లో చేరితే ఏగేమ్‌లోనైనా రాణించగలరు. హ్యాపీ వరల్డ్ అథ్లెటిక్స్ డే.

బి.శ్రీనివాసకుమార్, డీఎస్‌డీవో, కాకినాడ

ఏ ఆటకైనా ఫిట్‌నెస్ ముఖ్యం



ఏ ఆట ఆడాలన్నా ముందుగా ఫిట్నెస్ అవసరం. అది అథ్లెటిక్స్ ద్వారానే వస్తుంది. 1999 నుంచి 2004 వరకు రన్నింగ్‌లో సీనియర్ నేషనల్ బ్రాంజ్ మెడల్, 400 మీటర్ల అడల్ట్స్‌లో నేషనల్ రికార్డ్, ఏషియన్ గ్రాండ్‌ప్రిక్స్‌లో బ్రాంజ్ మెడల్, ఆఫ్రో ఏసియన్ గేమ్స్‌లో నాలుగో స్థానం, వరల్డ్ గేమ్స్, సౌత్ ఏషియన్ గేమ్స్.. ఇలా ఎన్నో పతకాలు సాధించాను. 2006 కోల్‌కతాలో కోచింగ్ డిప్లొమా, ఆర్మీ టీమ్‌కి, సర్వీస్ టీమ్‌కి కోచ్‌గా వ్యవహరించాను. 2011 నుంచి 2013 వరకు ఇండియా అథ్లెటిక్స్ టీమ్ అడల్ట్స్, హైజామ్‌కి కోచ్‌గా పని చేశాను. 2017లో వైఎస్సార్ కడప జిల్లా స్పోర్ట్స్ స్కూల్స్‌కి స్పోర్ట్స్ ఆఫీసర్‌గాను, 2018లో నాగార్జున యూనివర్సిటీలో చీఫ్ కోచ్‌గాను విధులు నిర్వర్తించాను. 2019 నుంచి 2023 వరకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ కోచ్‌గా పని చేశాను.

పైడి వరప్రసాద్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్, జడ్డంగి హైస్కూలు


నేటి బాలలే... రేపటి అథ్లెట్లు
కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో చిన్నారుల సాధన

ఏపీ ఈఏపీసెట్ దరఖాస్తులో తప్పుల సవరణకు
రేపటి వరకు గడువు

- మార్పు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో అవకాశం
- మొత్తం 3,60,702 దరఖాస్తులు
- ఈనెల 12 నుంచి హాల్‌టికెట్‌ల డౌన్‌లోడ్
- 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణ
- ఏపీ ఈఏపీసెట్ చైర్మన్, ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్



జేఎన్టీయూకే, మే 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 దరఖాస్తులో ఏమైనా తప్పులుంటే ఈ నెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మార్పు చేసుకునేందుకు గడువు ఉందని సెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఏపీఎస్సీహెచ్ఈ నేతృత్వంలో కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో జరిగే ఏపీ ఈఏపీసెట్‌కు ఇప్పటివరకూ 3,60,702 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రూ.2000 అపరాధ రుసుముతో మే 7వరకూ రూ.4000తో 12వ తేదీ వరకు, రూ.10,000 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకూ https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షలకు ఏపీలో 46, తెలంగాణాలోని హైదరాబాద్‌లో 2 ప్రాంతీయ కేంద్రాలు మొత్తం 48 ప్రాంతీయ కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతాయని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. దరఖాస్తులో విద్యార్థులు ఏదైనా సమాచారాన్ని తప్పుగా పూరించినట్లయితే వారు ఈఏపీ సెట్ సహాయకేంద్రాన్ని సంప్రదిస్తే కేటగిరి-1కు సంబంధించిన విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, సంతకం, ఫొటో, ఇంటర్ హాల్‌టికెట్ నెంబర్, విభాగం, కమ్యూనిటీ వివరాలను సవరించనున్నట్టు చెప్పారు. అలాగే కేటగిరి-2కు సంబంధించి ఇంటర్ పూర్తిచేసిన సంవత్సరం, మాధ్యమం, విద్యా వివరాలు, బ్రిడ్జి కోర్సు హాల్ టికెట్ నెంబరు, తల్లి పేరు, జెండర్, ఆధార్, రేషన్ కార్డు వివరాలు, మైనార్టీ, నాన్‌మైనార్టీ వివరాలు, స్థానికత వివరాల్లో తప్పులుంటే ఈ నెల 8వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో మార్పు చేసుకునేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను ఈనెల 12నుంచి ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌తోపాటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884 235 9599, 234 2499 నెంబర్లలో కానీ, helpdeskapeapcet@apsche.org అనే మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించవచ్చని కన్వీనర్ వీవీ సుబ్బారావు సూచించారు.

స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌తో
జేఎన్టీయూకే ఎంవోయూ


ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న యూనివర్శిటీ, కంపెనీ ప్రతినిధులు

జేఎన్టీయూకే, మే 6 (ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని వీసీ సమావేశ హాల్లో హైదరాబాద్‌లోని స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, కాకినాడ జేఎన్టీయూకే మధ్య అవగాహనా ఒప్పందం(ఎంవోయూ) కుదిరినట్టు ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఐఐఐపీటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీటీ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఈ ఎంవోయూ ద్వారా వర్శిటీ విద్యార్థులకు అనుభవపూర్వక ప్రాజెక్టు ఆధారిత అభ్యసన మరింత సులభతరమవుతుందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు, అధ్యాపకులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్స్, హ్యాకథాన్స్, ఎఫ్‌డీపీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఉపాధ్యక్షురాలు ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థి కేంద్రీకృత విధానం, నూతన ఆవిష్కరణలు, విలువలతో కూడిన శిక్షణను తమ సంస్థ ద్వారా విద్యార్థులకు అందిస్తామన్నారు. వీసీ సమక్షంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, స్మార్ట్ బ్రిడ్జ్ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి సంతకాలు చేసిన ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, మాజీ వీసీ మురళీకృష్ణ, డైరెక్టర్లు ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, ప్రొఫెసర్ జి.పద్మజారాణి, ప్రొఫెసర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, స్వర్ణకుమారి, చక్రవర్తి పాల్గొన్నారు.

వరదలను సమర్ధవంతంగా ఎదుర్కొందాం

- ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ గోపీనాథ్
- డీఈలు, ఏఈల నుంచి క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలుసుకున్న ఉన్నతాధికారి


డీఈలు, ఏఈలతో మాట్లాడుతున్న ఎస్ఈ గోపీనాథ్

ధవళేశ్వరం, మే 6 (ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి అందరూ సంసిద్ధంగా ఉండాలని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్ కోరారు. మంగళవారం ఉదయం తమ కార్యాలయంలో ఈఈలు, డీఈలు, ఏఈలతో వరద నివారణ సమాయత్త సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, ఏటిగట్ల పటిష్ఠత, ఔట్‌ఫాల్ స్లూయిస్‌ల పరిస్థితి తదితర వివరాలు, వాటి నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో గోదావరి వరదల వల్ల బలహీన పడిన ఏటిగట్లు, వాటి పటిష్ఠతకు తీసుకున్న చర్యలు, ప్రస్తుతం ముందస్తుగా తీసుకోవాల్సిన పనుల వివరాలను అడిగారు. వరద నివారణ చర్యలు చేపట్టడానికి ఫ్లడ్ స్టోర్స్‌లో ఉన్న ఫ్లడ్ మెటీరియల్ వివరాలతో పాటు కావాల్సిన ఫ్లడ్ మెటీరియల్ వివరాలు అందజేయాలన్నారు. ఫ్లడ్ బ్యాంకులపై కాలువ గట్లపై చెత్తను డంప్ చేస్తున్న గ్రామ పంచాయతీలకు నోటీసులు పంపించాలని ఆదేశించారు.అధికారులు క్షేత్రస్థాయిలో ఫ్లడ్ బ్యాంక్‌లను, ఔట్‌ఫాల్ స్లూయిస్‌ల పరిస్థితిని పరిశీలించాలని ఇసుక ర్యాంపుల కోసం కొన్ని చోట్ల ఫ్లడ్ బ్యాంక్‌లను ఛిద్రం చేస్తున్నారని వాటిని గుర్తించి చర్యలు తీ సుకోవాలని సూచించారు. వరదలను ఎదుర్కోవడానికి ఫ్లడ్ డ్యూటీ అధికారులు అందరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. సమావేశంలో హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, డిప్యూటీ ఎస్ఈ జి.కనకేష్, తూర్పు డెల్టా ఈఈ వి.రామకృష్ణ, మధ్య డెల్టా ఈఈ బి.శ్రీనివాసరావు, డ్రైనేజీ డివిజన్ ఈఈ కిషోర్, వశిష్ట సబ్ డివిజన్ డీఈ జి.శ్రీనివాస్, హెడ్‌వర్క్స్ సబ్ డివిజన్ డీఈ ఆనందబాబు, గౌతమి సబ్ డివిజన్ డీఈ సుబ్బారావు, ఏఈలు విశ్వనాథరాజు, ఎ.సాయిరాం, సునీల్, రాధాకృష్ణ, ప్రసాద్, మణికంఠ, ఎ.శివ తదితరులు పాల్గొన్నారు.

సన్నద్ధంగా ఉన్నాం

గోదావరి వరదలను ఎదుర్కోవడానికి సన్నద్ధంగా ఉన్నామని ఎస్ఈ కె.గోపీనాథ్ తెలిపారు. 20లక్షల క్యూసెక్కులకు పైబడి వరద వచ్చినా తట్టుకునే విధంగా ఫ్లడ్ బ్యాంక్స్ పటిష్ఠంగా ఉన్నాయన్నారు. కాటన్ బ్యారేజ్ గేట్లకు మరమ్మతులు చేపట్టడానికి రూ.15 లక్షలతో అంచనాలు రూపొందించామని, అనుమతి లభించిన వెంటనే పనులు చేపడతామని తెలిపారు. కూళ్ల, సుందరపల్లి, కుండలేశ్వరం తదితర ప్రాంతాల్లో బలహీన ఫ్లడ్ బ్యాంక్‌లను తాత్కాలికంగా పటిష్ఠం చేస్తామని తాజా, ఈస్ట్ కొక్కిలేరు, కడలి తదితర ప్రాంతాల్లో కొత్త ఔట్‌ఫాల్స్ స్లూయిస్‌ల నిర్మాణానికి రూ.9.4 కోట్లతో రూపొందించిన అంచనాలకు ఆమోదం లభించిందని,వరదల అనంతరం పనులు చేపడతామని పేర్కొన్నారు. ఫ్లడ్ స్టోర్‌లలో అవసరమైన ఫ్లడ్ మెటీరియల్ కోసం టెండర్లు పిలుస్తామని తెలిపారు. కాల్వ గట్లు వెంబడి ఫ్లడ్ బ్యాంక్‌లపై చెత్తను వేస్తున్న గ్రామ పంచాయతీలకు నోటీసులు జారీ చేసే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఎస్ఈ గోపీనాథ్ చెప్పారు.

11న బాస్కెట్‌బాల్ అండర్-23
జట్ల ఎంపికలు

పిఠాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పురుషులు, మహిళలు (అండర్-23) బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక, చాంపియన్‌షిప్ పోటీలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ఉన్నత పాఠశాలలలో ఈ నెల 11వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు) తెలిపారు. క్రీడాకారులు 2002 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఒక పట్టణం నుంచి ఒక టీమ్‌ను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు ఆధార్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలను ఒరిజనల్ తీసుకురావాలని సూచించారు.

పాపికొండల యాత్రకు గ్రీన్ సిగ్నల్

దేవీపట్నం, మే 6(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల విరామం అనంతరం పాపికొండల విహారయాత్ర పర్యాటక బోట్లకు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆదివారం ఉదయం మండలంలో ఈదురుగాలులు భారీ వర్షం కురవడంతో పాపికొండలు వెళ్లే బోట్లను అధికారులు నిలిపివేశారు. దీంతో మూడు రోజులు పాటు విహార యాత్ర నిలిచిపోయింది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో బుధవారం నుంచి యాత్రకు వెళ్లేందుకు పర్యాటకుల బోట్లకు అధికారులు అనుమతులిచ్చారు. బుధవారం సుమారు 70 మంది పర్యాటకులు ఆన్‌లైన్‌లో టిక్కెట్లను బుక్ చేసినట్టు తెలిసింది.

నాడు రాలే.. నేడు హాయిలే..




యానాం నుంచి నీలపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో మోడుబారి అటుపై పచ్చదనంతో నిండిన రావిచెట్టు

వసంతమాసం వచ్చిందంటే చెట్లు మోడుబారుతాయి. మళ్లీ కొత్తగా చిగురిస్తాయి. సామర్లకోట, యానాం రహదారుల్లో భారీ వృక్షాలు మోడుబారి రోజుల వ్యవధిలో పచ్చదనం సంతరించుకున్న దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా.




సామర్లకోట ప్రభుత్వ పశువైద్యశాల ఆవరణలో భారీ చెట్టు దృశ్యాలు

మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి మృత్యువాత

గోదావరిలో స్నానానికి దిగి ఇద్దరు యువకుల మృతి

కపిలేశ్వరపురం మండలం వీధివారిలంకలో సంఘటన

కపిలేశ్వరపురం/మండపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక శివారు వీధివారిలంకలో మంగళవారం స్నానానికి దిగి ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం మండపేట మార్కెట్‌కు సెలవు కావడంతో పట్టణానికి చెందిన దాసరి సాయిరామ్ (27), మెండెం రాంబాబు(35), వనుం గోవిందు, బెజవాడ శ్రీనివాస్‌లు వీధివారిలంకలోని ధనమ్మ మర్రి వద్ద మొక్కు చెల్లించుకునేందుకు వెళ్లారు. మొక్కు తీర్చుకుని భోజనాలు చేసిన అనంతరం చెంతనే ఉన్న గోదావరిలో దిగి స్నానానికి దిగి రాంబాబు, సాయిరామ్‌లు గోదావరిలో గల్లంతయ్యారు. దీంతో మండపేట రూరల్ సీఐ పెద్దిరాజు, అంగర ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా సాయిరామ్, రాంబాబు మృతదేహాలు లభ్యమయ్యాయి. వీఆర్వో వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు.



రాంబాబు మృతదేహం, ఫైల్‌ఫొటో



సాయిరామ్ మృతదేహం, ఫైల్‌ఫొటో

మండపేటలో విషాదఛాయలు

ఇద్దరు మృతితో మండపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. పార్థసారథినగర్‌కు రాంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రాంబాబు తండ్రి పొగాకు వ్యాపారం చేస్తుంటాడు. సాయిరామ్ ఆంధ్రా బ్యాంకు వీధిలోని ప్రైవేటు చార్టెడ్ అకౌంటెంట్ వద్ద పనిచేస్తున్నాడు. అతడు అవివాహితుడు, తండ్రి కేపీరోడ్డులో బియ్యం వ్యాపారం చేస్తుంటాడు. మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి మృత్యువాతపడడంతో ఇద్దరి కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదిస్తున్నారు.

కుమార్తెను బస్సు ఎక్కించడానికి వెళ్తూ..

ఆర్టీసీ బస్సు ఢీకొని ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి



మృతిచెందిన బత్తిన వెంకటరమణ

ధవళేశ్వరం, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందాడు. మంగళవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ప్రధాన రహదారిపై జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామానికి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ హెడ్‌కానిస్టేబుల్ బత్తిన వెంకటరమణ(56) కుటుంబంతో కొంతమూరులో ఉంటూ రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తనకు కేటాయించిన విధులు నిర్వర్తించడానికి వేమగిరి పయనమయ్యాడు. తన కుమార్తెను బ్యారేజి సెంటర్ వద్ద బస్సు ఎక్కించడానికి ద్విచక్రవాహనంపై తీసుకెళ్తూ ధవళేశ్వరం సినిమా థియేటర్ సెంటర్ సమీపంలోకి వస్తుండగా రాజోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమహేంద్రవరం నుంచి వస్తూ సైడ్ నుంచి ఢీకొనడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి వెంకటరమణ బస్సు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కుమార్తెకు గాయాలు కాలేదు. ప్రమాద సమాచారం అందుకున్న ధవళేశ్వరం సీఐ గణేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరమణ కుటుంబ సభ్యులను ఎస్పీ నరసింహకిషోర్ పరామర్శించి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వెంకటరమణ భౌతికకాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తూర్పుగోదావరి ఎస్పీ

ఒంగోలు ఆవు రికార్డు

ఒక్కరోజులో 21.19 లీటర్ల పాలు

మండపేట, మే 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పాడి రైతు వేగుళ్ల మురళీకృష్ణకు చెందిన ఒంగోలు జాతి ఆవు పాలు ఇవ్వడంతో రికార్డు నెలకొల్పింది. సాధారణంగా ఒంగోలు జాతి ఆవు పూటకు రెండున్నలీటర్ల నుంచి మూడు లీటర్లు ఇస్తుంది. రోజుకు 5లేదా 6లీటర్లు ఇవ్వటం పరిపాటి. అలాంటిది మురళీకృష్ణకు చెందిన 5ఏళ్ల ఆవు మంగళవారం ఉదయం 11.5 లీటర్లు, సాయంత్రం 9.6 లీటర్లు కలిపి ఒక్కరోజులో 21.19 లీటర్ల పాలు ఇచ్చి సరికొత్త రికార్డును సొంతం చేసుకుంది. కేంద్రియ పశు నమోదు అధికారి డి.రాజేశ్వరరావు సమక్షంలో మురళీకృష్ణ పాలు తీయగా పాలు వివరాలను నమోదు చేసి కేంద్రియ పశు నమోదు సెంటర్‌కు పంపించారు.



రికార్డు స్థాయిలో పాలు ఇచ్చిన ఆవు


నేటి నుంచే సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాలు

- తొలిరోజు పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరణ
- శరవేగంగా ఏర్పాట్లు ● పరిశీలించిన కాకినాడ జిల్లా ఎస్పీ



సత్యదేవుని దివ్యకల్యాణం కోసం కొబ్బరి బొండాలతో అలంకరణ

అన్నవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే భక్తవరదాయుడు అన్నవరం సత్యదేవుడు వరుడవుతున్న వేళ రత్నసత్యగిరులు పులకించిపోతున్నాయి. శ్రీవిశ్వావసు నామ సంవత్సర వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. తొలిరోజు సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను పండితులు పెళ్లికొడుకు, పెళ్లికూతురుగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అనివేటి మండపం వద్ద ప్రత్యేక అలంకరణలు చేపడుతున్నారు. మంగళవారం సాయంత్రం కల్యాణవేదికను కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు పరిశీలించారు. ప్రముఖులు, సామాన్యుల గ్యాలరీలను పరిశీలించి సూచనలు చేశారు. భక్తులు ఎక్కువగా వస్తుండడంతో ఎటువంటి దొంగతనాలు, అవాంఛనీయ సంఘటన లు జరగకుండా ప్రత్యేక చర్యలు అదనపు సీసీ కెమెరాలతో నిఘా పెంచినట్టు డీఎస్పీ తెలిపారు. సుమారు 100 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. ప్రముఖుల వాహనాలు, ఫైర్ ఇంజన్, అంబులెన్స్‌లు మాత్రమే తూర్పురాజగోపురం పార్కింగ్ వద్ద నిలపనున్నారు. భారీవాహనాలను కొండదిగువన కళాశాల మైదానంలో ఉంచి దేవస్థానం, ప్రయివేట్ బస్సుల్లో భక్తులను కొండపైకి తీసుకెళ్లనున్నట్టు ఈవో వివరించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామ్మోహనరావు, ఏఈవోలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. కోనసీమ జిల్లా మండపేటకు చెందిన ఒక భక్తుడు ప్రత్యేక అలంకరణతో తయారుచేయించిన కొబ్బరిబొండాలను స్వామివారి కల్యాణానికి వినియోగించాలని కోరారు.



విద్యుత్ కాంతుల్లో ఆలయం

దివ్యకల్యాణం సందర్భంగా దేవస్థానం కొండపై, కొండదిగువన ఏర్పాటుచేసిన విద్యుద్దీపఅలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఐపీఎస్ అధికారుల పూజలు

సత్యదేవుని సన్నిధిలో మంగళవారం రాత్రి ఐపీఎస్ అధికారులు డైరెక్టర్ జనరల్ అంజనీకుమార్, జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్, కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా మంగళవారం ప్రత్యేకపూజలు జరిగాయి.

వక్ఫ్‌చట్ట సవరణను నిరసిస్తూ

ముస్లింల భారీ ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తూర్పుగోదావరి జిల్లారాజమహేంద్రవరంలో ముస్లింలు భారీ ర్యాలీ చేశారు. రాజమండ్రి ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో జాంపేట మసీదు -ఆజాద్ చౌక్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన భారీ ర్యాలీలో వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ మహ్మద్ ఆరిఫ్ మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లు ముమ్మాటికి రాజ్యాంగ ఉల్లంఘనేనని అన్నారు. భారతదేశంలో సుమారు 22కోట్ల మంది ముస్లింల ఆస్తిత్వాన్ని అస్థిరపరిచేవిధంగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వక్ఫ్‌చట్టాన్ని కేంద్రం ఆమోదించడం దారుణమన్నారు. ముస్లిం ఆస్తులను కాజేసే కుట్రలో భాగంగానే ఈ చట్టసవరణ చేశారని, ఇది భారత రాజ్యాంగానికి చీకటి రోజు అని అన్నారు. ముస్లింల ఆస్తులను ప్రభుత్వాలు తమ ఆధీనంలోకి తీసుకుని వారిని అణచివేయాలనుకోవడం ముస్లిం సమాజాన్ని భయపెట్టడమేనన్నారు. ర్యాలీలో హబీబుల్లాఖాన్, అహ్మద్ అన్సర్, కలిముల్లాఖాన్, అన్సర్, ముక్తియార్, బ్యూటీ షరీఫ్, డిల్లు, అసదుల్లా అహ్మద్, సల్మాన్,బాబులు రబ్బాని పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

కారు కింద పడి ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయాలపాలైన ఓ వ్యక్తి

నల్లజర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నపురానికి చెందిన భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డిలకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి బైక్‌పై కన్నపురం నుంచి తాడేపల్లిగూడెం వెళ్తుండగా ప్రకాశరావుపాలెం శివారులో కారును అధిగమించే ప్రయత్నంలో అదే కారు కింద పడి తీవ్ర గాయాలయ్యారు. 108లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఏ కేసు నమోదు కాలేదని ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నిర్విరామంగా విద్యుదుత్పత్తి



పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న యూనిట్లు

ఏప్రిల్ 1 నుంచి మే 5 వరకు విద్యుదుత్పత్తి వివరాలు

ప్రాజెక్టు	సామర్థ్యం మెగావాట్లు	ఉత్పత్తి మిలియన్ యూనిట్లు
మాచ్‌ఖండ్	120	45.12
సీలేరు	240	57.85
డొంకరాయి	25	14.97
పొల్లూరు	460	121.98

మోతుగూడెం, మే 6 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ఉన్న జలవిద్యుత్ కేంద్రాల్లో నిర్విరామంగా విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఒక్క మాచ్‌ఖండ్ మినహా అన్ని కేంద్రాల్లో యూనిట్లు అందుబాటులో ఉండటంతో ఉత్పత్తి నిరంతరంగా జరుగుతోంది. ఉన్న నీటి నిల్వలను సద్వినియోగం చేసుకుంటున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కాంప్లెక్స్ పరిధిలోని నాలుగు జల విద్యుత్తు కేంద్రాల్లో మాచ్‌ఖండ్ మినహా అన్ని లక్ష్యాన్ని పూర్తి చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మాచ్‌ఖండ్‌తో సహా అన్ని చోట్ల లక్ష్యసాధన దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది మాచ్‌ఖండ్‌లో నాలుగో యూనిట్ షాఫ్ట్‌షీట్ నుంచి నీరు లీకేజీ అవుతుండటంతో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. గత నెలలో అరకు లైన్‌ట్రిప్ అవుతుండడంతో మొదటి యూనిట్ నుంచి ఉత్పత్తి ఆపేశారు. ఈ 2 యూనిట్లను వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. సీలేరు, పొల్లూరు, డొంకరాయి, మాచ్‌ఖండ్‌లో ప్రస్తుతం రోజుకు 4 నుంచి 5 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి జరుగుతోంది.

ఇంటిపై పిడుగుపడి మహిళకు గాయాలు

తాళ్లపూడి, మే 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో ఇటీవల కురిసిన వర్షానికి ఓ ఇంటిపై పిడుగుపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని బొర్రా వీరలక్ష్మి ఇంటిపై పిడుగుపడి ఇల్లు పాక్షికంగా దెబ్బతినడమేకాక ఆమె గాయాల పాలైంది. దీంతో రాజమహేంద్రవరంలోని ప్రవేటు ఆసుపత్రిలో చేర్చారు. అన్నదేవరపేట వీఆర్వో కావూరి నాగేశ్వరరావు నివేదిక ప్రకారం ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. వైద్యం నిమిత్తం రూ.8000 అందించినట్టు తెలిపారు.

రైలు ఢీ కొని మహిళ మృతి

తుని రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని మహిళ మృతిచెందిన సంఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నర్సీపట్నం 1 రైల్వే స్టేషన్ ప్లాట్‌పారంలో పట్టాలు దాటుతుండగా సాలూరు సంతోషి (35) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న తుని రైల్వే పోలీసులు మృతురాలి వివరాలు సేకరించారు. విజయనగరం జిల్లా తోట వలస గ్రామానికి చెందిన మహిళగా గుర్తించినట్టు తెలిపారు. శవ పంచనామాలు అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

ట్రావెల్ బ్యాగులో నగదు దొంగతనంపై కేసు

కొవ్వూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ట్రావెల్ బ్యాగులో నగదు దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకి చెందిన మద్దల లక్ష్మీసాయి రామజ్యోతి తన అత్తకు అనారోగ్యం కారణంగా ఈ నెల 5న రూ.1,70,000 నగదును బ్యాగ్‌లో సర్దుకుని సింగవరం నుంచి నిడదవోలు ఆసుపత్రికి వచ్చింది. ఆసుపత్రిలో అత్తకు చికిత్స చేయించి ఆటోలో సింగవరం పంపించిన అనంతరం బస్టాప్‌కి వచ్చి 20 నిమిషాలు వేచి ఉంది. అనంతరం తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే పల్లెవెలుగు బస్సు ఎక్కి కొవ్వూరు టోల్‌గేట్ వద్ద దిగింది. అక్కడి నుంచి తన తండ్రికి ఫోన్ చేయగా బండిపై టోల్ ప్లాజా వద్దకు ఆయన వచ్చాడు. తండ్రితో పాటు లక్ష్మీసాయి రామజ్యోతి దొమ్మేరులోని తల్లి ఇంటికి వెళ్లింది. అక్కడ బ్యాగును తెరిచి చూడగా నగదు కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

శాస్త్రీయ సలహా సంఘం సమావేశం

రాజమహేంద్రవరం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని జాతీయ వాణిజ్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం కలవచర్ల వారి శాస్త్రీయ సలహా సంఘం సమావేశం మంగళవారం జరిగింది. జాతీయ వాణిజ్య పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషమాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రాంతీయ వరి పరిశోధన సంస్థ మార్టేరు అసోసియేట్ డైరెక్టర్ టి.శ్రీనివాస్, పి.ముత్తురామన్, హైదరాబాద్ భారత వరి ప్రధాన శాస్త్రవేత్త ఐసీఏఆర్ వీఎస్‌జీఆర్ నాయుడు, కేవీకే కలవచర్ల హెడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంకేతిక నిపుణులు 2024-25లో చేపట్టిన కార్యక్రమాలు, 2025-26 సంవత్సరంలో చేపట్టబోయే కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేశారు. శేషమాధవ్ మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టు మేటర్ స్పెషలిస్టు జిల్లాలోని కేవీకే పరిధిలోని మండలాలకు చెందిన వ్యవసాయ, ఉద్యాన రంగాల సమాచారాన్ని బెంచ్ మార్కు సర్వేగా పరిగణించుకుని సహజ వనరుల ఉప లబ్ధి తదితర అంశాలపై మ్యాపింగ్ చేసుకుని అత్యంత అవశ్యకత అంశాలను గుర్తించి డాక్యుమెంట్ చేయాలని సూచించారు. నాయుడు మాట్లాడుతూ కేవీకే గతేడాదిలో చేపట్టిన వ్యవసాయ విభాగం కార్యక్రమాలను వివరించారు. ఉద్యానవన విభాగం జీవిఆర్ సత్యవేణి ఉద్యానవన విభాగం చేపట్టిన ప్రదర్శన, క్షేత్రస్థాయి పరిశీలన వివరించారు. సస్యరక్షణ విభాగం కార్యక్రమాలను ర ఘునందన్ చెప్పారు. పశు నిర్వహణను డాక్టర్ బి.నాగేశ్వర్‌రెడ్డి, మత్స్యశాఖను డాక్టర్ రవీంద్ర, హెగ్డే గృహ విజ్ఞాన కార్యక్రమాలను సంజయ్ వివరించారు. రైతుల ప్రయోజనార్థం లిల్లీతోటల్లో నులిపురుగు నివారణ సమగ్ర యాజమాన్యం, పసుపులో దుంప కుళ్లు సమగ్ర యాజమాన్యం అనే రెండు కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో ఏరువాక, రాజమండ్రి, కాకినాడ శాస్త్రవేత్తలు ఎంబీవీ చలపతిరావు, పి.లలితాకామేశ్వరి, డీవీఎస్ రాజు, శిరీష తదితరులు పాల్గొన్నారు



కరపత్రాలను విడుదల చేస్తున్న డైరెక్టర్ మాగంటి శేషమాధవ్, శాస్త్రవేత్తలు

చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుకు చర్యలు

ఉప్పాడ చేనేత కార్మికులతో ఆర్‌జీఎస్‌ఏ కోఆర్డినేటర్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ వినోద్

కొత్తపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ చేనేత జాంధానీ చీరల ఉత్పత్తి, తద్వారా చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుపరిచేం దుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విజయవాడ నుంచి ఆర్‌జీఎస్‌ఏ (రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్య అభియాన్) కో ఆర్డినేటర్ వినోద్ మంగళవారం కాకినాడ జిల్లా ఉప్పాడ వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులతో సమా వేశమయ్యారు. రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్య అభియాన్‌లో ఉప్పాడ గ్రామం ఎంపికైందన్నారు. దేశ, విదేశాల్లో ఉప్పాడ చేనేత జాం ధానీ చీరలకు మంచిగుర్తింపు ఉందని అటువంటి ఖరీదైన చీరలు తయారు చేసేందుకు అవసరమైన వసతులు, తద్వారా కార్మికుల జీవనప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం రూ.5కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టు రూపొందించినట్టు చెప్పారు. దానిలో భాగంగా చేనేత కార్మికులకు ఏ వసతులు కల్పించాలి, జాంధానీ చీరల తయారీకి సమకూర్చాల్సిన ముడిసరుకు తదితర విషయాలపై చర్చించారు. చేనేత చీరల తయారీకి అవసరమైన ముడిసరుకులను రాయితీపై అందచేయాలని చేనేత కార్మికుడు దైవం మహేష్ కోరాడు. చీరల తయారీకి పడుగు, హల్లులు చేసేందుకు విశాలమైన ప్రదేశం అవసరం ఉంటుందన్నారు. ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీజాన్, ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వందేళ్ల వృక్షం.. బతికించుకుందాం!



రాజమహేంద్రవరంతో పాటు చుట్టు పక్కల భారీ వృక్షాలు కనుమరుగయ్యాయి. అభివృద్ధి పేరుతో రహదారులు విస్తరణలో వందలాది వృక్షాలను నరికేశారు. దీంతో నగర పరిసరాలు ఎండవేడిమికి మండిపోయి చల్లదనం కరువైంది. కొత్తగా మొక్కలు నాటి వాటిని వృక్షాలు చేయడానికి సమయంపడుతుంది. కానీ ఉన్నవాటిని నిలబెట్టుకుంటే నెలల వ్యవధిలో అవి పునర్జీవం పొంది చల్లటి నీడను బాటసారులకు ఇస్తాయి. ఇలాంటి చెట్లే రాజమహేంద్రవరంలో అక్కడక్కడ దర్శనమిస్తున్నాయి. లాలాచెరువు సెంటర్‌లో బస్టాండ్ వెనకాల ఒక భారీ వృక్షం నెలకొరిగింది. దీని వయస్సు సుమారు 100 ఏళ్లు. దానంత వయస్సు వరకు మనుషులు బతకకపోయిన అటువంటి వాటిని బతికించుకుంటే మరిన్ని వందల ఏళ్లు బతికి భవిష్యత్ తరాలకు ఆక్సిజన్‌ను అందిస్తుంది. సినిమా చెట్టును బతికించిన సంస్థలు రాజమహేంద్రవరంలో ఇలాంటి వృక్షాలపైన కూడా దృష్టిపెడితే బాగుంటుంది.

ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

పి.గన్నవరంలో ఆక్రమణల తొలగింపు

● కాల్వ చెంతనే బయటపడ్డ బ్రిటీషుకాలం నాటి దీపపు స్తంభం



ఆక్రమణల తొలగింపులో బయటపడ్డ బ్రిటీషు కాలంనాటి దీపపు స్తంభం

పి.గన్నవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ప్రధాన పంటకాల్వ(వార్ఫ్) చెంతనే ఉన్న ఆక్రమణలను మంగళవారం వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో తొలగించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్ నేతృత్వంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో పి.గన్నవరం వార్ఫ్ నుంచి స్థానిక అక్విడెక్టు వరకు కాల్వచెంతనే ఉన్న 44ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. గతంలో అనేక సార్లు ఆక్రమణల తొలగింపుపై సంబంధిత వర్తకులకు అధికారులు నోటీసులు అందించి రాజకీయ వత్తిళ్ల కారణంగా వాయిదా వేసుకుంటూ వచ్చారు. ఈసారి ఆక్రమణల తొలగింపు విషయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నారు. ఈసారి పదిరోజుల ముందే వర్తకులకు విషయం తెలిపి స్వచ్ఛందంగా షాపులను తొలగించాలని సంబంధిత శాఖల సిబ్బంది సూచించారు. దీంతో షాపులను తొలగించేందుకు వర్తకులు మానసికంగా సిద్ధపడ్డారు. కానీ బడ్డీలను తొలగించడానికి ఒకరోజు గడువు కావాలని అధికారులను కోరడంతో సాయంత్రం వరకు సమయం ఇచ్చి ఎక్స్‌కవేటర్‌తో తొలగింపు పనులు కొనసాగించారు. ప్రధాన సెంటర్‌లో ఆక్రమణల వలన వాహనదారులు, స్థానిక ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారని అధికారులు చెబుతున్నారు. అనంతరం ప్రధాన పంటకాల్వ చెంతనే సుమారు 150మీటర్లు వరకు రక్షణగోడ నిర్మిం చేందుకు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. గోడ నిర్మాణం అనంతరం రోడ్డుకు కాల్వకు మధ్య దూరాన్ని బట్టి రోడ్డును అభివృద్ధి చేసే ఆలోచనలో ఉన్నట్లు ఆర్అండ్‌బీ అధికా రులు తెలిపారు. ఆక్రమణలు తొలగింపు అనంతరం బ్రిటీషు కాలంలో ప్రధాన కాల్వచెంతనే వార్ఫ్‌లో సరుకులు రవాణా పడవలు ఎగుమతులు, దిగుమతులు జరిగేవి వాటికి సంబంధించిన ఆనవాళ్లు(దీపపు స్తం భాలు, బోర్డులు) బయటపడ్డాయి. ఆక్రమ ణల తొలగింపు ప్రక్రియను ఇరిగేషన్ డీఈ నాగేంద్రకుమార్, ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్ర, ఇరిగేషన్ జేఈ సుందర్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు పరిశీలించారు.

రోడ్డు పనుల్లో ఉద్రిక్తత


బైపాస్ రోడ్డు పనులను అడ్డుకున్న రైతులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

● బైపాస్ రోడ్డు పనులను అడ్డుకున్న స్థానికులు
● న్యాయం చేయాలంటూ ఆందోళన
● పోలీసు బందోబస్తు నడుమ రోడ్డు నిర్మాణ పనులు
● రైతులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మామిడికుదురు, మే 6(ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న బైపాస్ రోడ్డు పనులను పాశర్లపూడిలో స్థానిక రైతులు అడ్డుకున్నారు. మంగళవారం భారీ పోలీసు బందోబస్తు నడుమ బైపాస్ రోడ్డును ప్రారంభించగా బాధిత రైతులు తమకు న్యాయంచేసి రోడ్డు ఏర్పాటు చేయాలని ఆందోళన చేశారు. రోడ్డు పక్కనే గల విలువైన తమ భూములకు చదరపు గజాల్లో నష్టపరిహారం చెల్లించాలని, ఎలైన్‌మెంట్ ఎందుకు మార్చారో తెలపాలని డిమాండ్‌చేస్తూ నిరసన తెలిపారు. ఒక దశలో పోలీసులకు, బాధిత రైతులకు వాగ్వివాదం జరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కనీసం తమకు సమాచారం ఇవ్వకుండా నష్టపరిహారం చెల్లించకుండా తమ భూముల నుంచి రోడ్డును ఏవిధంగా వేస్తారంటూ బాధిత రైతులు పనులను అడ్డుకుని పోలీసులతో వాగ్వివాదం చేశారు. పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్ఐ చైతన్యకుమార్‌లు రైతులతో మాట్లాడినప్పటికీ వారు ససేమిరా అనడంతో ఆందోళన చేస్తున్న రైతులను బలవంతంగా పోలీసు వ్యానులో ఎక్కించి నగరం పోలీసుస్టేషన్‌కు తరలించారు. పాశర్లపూడి గ్రామంలో 300 మీటర్లలో 16 మంది రైతులకుగాను 1.32 ఎకరాల భూమికి నష్టపరిహారం చెల్లించాల్సిందని ఇన్‌చార్జి తహశీల్దార్ కె.శరణ్య తెలిపారు. ఈ భూమిలో రోడ్డు ఏర్పాటు చేస్తుంటే సంబంధిత భూయజమానులు నోటీసులు తీసుకోకుండా పనులు అడ్డుకోవడంతో మంగళవారం భారీ పోలీసు బందోబస్తు నడుమ రోడ్డు నిర్మాణ పనులను మొదలు పెట్టారు. కార్యక్రమంలో ఎస్ఐలు శివకృష్ణ, హరికోటిశాస్త్రి, ఆర్ఐ ఇబ్రహిం, పోలీసు సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

అయినవిల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): వీరవల్లిపాలెం గ్రామంలో టీడీపీ సభ్యత్వ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. టీడీపీ గ్రామశాఖ ఆధ్వర్యంలో 174, 175, 176, 177 బూత్‌లలో పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ సలాది పుల్లయ్యనాయుడు, మేడిశెట్టి సత్తిబాబు, అంజిబాబు, అడపా వెంకటేశ్వరరావు, సలాది నాని, శ్రీరెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

12న మాలల మహారణభేరిని విజయవంతం చేయాలి

అల్లవరం, మే 6(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల 12వ తేదీన జరిగే మాలల మహారణభేరి సభను విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మహారణభేరి కరపత్రాలను నాయకులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు పెయ్యల పరశురాముడు, రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు, కొనుకు బాపూజీ, సాధనాల శ్రీను, వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, తాళ్ల సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలి

మామిడికుదురు, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని డీఎల్పీవో బొజ్జిరాజు సూచించారు. మంగళవారం డీఎల్పీవో నగరం, గెద్దాడ, పాశర్లపూడి, మామిడికుదురు, పెదపట్నం గ్రామాల్లోపర్యటించి ఆయా గ్రామాల్లో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. స్వచ్ఛ గ్రామాలను తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, దానికి అధికారులు పూర్తిస్థాయిలో పనిచేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రొయ్యల చెరువుల తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు

కాట్రేనికోన, మే 6(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు పంచాయతీ విత్తనాలవారి కాల్వగట్టు సమీపంలో మంగళవారం అక్రమ రొయ్యల చెరువుల తవ్వకాలను గ్రామస్థులు అడ్డుకున్నారు. దీనితో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో మంచినీటి కోసం అని చెప్పి చెరువు తవ్వారని, ఇప్పుడు రొయ్యల చెరువుగా మార్చేందుకు తవ్వకాలు జరుపుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ 80 కుటుంబాలవారు నివసిస్తున్నారని, రొయ్యల సాగు జరిగితే తాము ఇబ్బందులు పడతామని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

సరోవర్‌కు ఎంపీడీవోగా పదోన్నతి


జీవీ సరోవరరావు

అంబాజీపేట, మే 6(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేసిన జీవీ సరోవరరావుకు ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. ఆయనకి పదోన్నతి రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అయినవిల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం అంబాజీపేటకు ఈవోపీఆర్డీ భీమారావు ఎంపీడీవోగా కొనసాగే అవకాశం ఉంది. పదోన్నతి పొందిన ఎంపీడీవో సరోవరరావును కార్యాలయ ఏవో నరసింహరావు, సీనియర్ అసిస్టెంట్ గిరి, ఉపాధి హామీ ఏపీవో అడపా వెంకటకృష్ణ, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలుచేయాలి

మామిడికుదురు, మే 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి ధాన్యాన్ని మద్ధతు ధరకు కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలని పి.గన్నవరం నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి కోరారు. మొగలికుదురులో తడిసిన ధాన్యపు రాశులను మంగళవారం వారు వైసీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నెల్లి దుర్గాప్రసాద్, నాయకులు తోరం భాస్కర్, తులా గోపాలకృష్ణ, జక్కంపూడి వాసు, మట్టపర్తి శివ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అంబాజీపేట మండలం గంగలకుర్రులో వర్షం కారణంగా తడిచిన ధాన్యాన్ని మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ ఆధ్వర్యంలో ఆయన పరిశీలించారు. మద్దతు ధరకు ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, సర్పంచ్ కాంగ్రేగుల శ్రీనివాస్ నాయకులు పేరి శ్రీను, ఎం.ఎంశెట్టి, పితాని సత్తిబాబు, దొమ్మేటి సత్యమోహన్, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎస్ఆర్ఎం అథిత్రి సేవలు ప్రశంసనీయం

● అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్


మహిళలతో పాల్గొన్న ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ప్రతినిధులు

అంతర్వేది, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళల స్వయం ఆర్థిక స్వావలంబనను పెంచే దిశగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్శిటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. కష్టాలకు కుంగిపోకుండా మనోధైర్యంతో ఆర్థికంగా ఉన్నతి సాధించాలని ఆయన మహిళలకు పిలుపునిచ్చారు. సఖినేటిపల్లి మండలంలోని మోరిలో వి కన్వెన్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ఏర్పాటుచేసిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కార్యక్రమానికి ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించే దిశగా ఎస్ఎంఆర్ యూనివర్శిటీ యాజమాన్యం రూ.68లక్షల విలువైన వివిధ రకాల మిషనరీని పంపిణీ చేయడం ఆనందంగా ఉందని ఎంపీ పేర్కొన్నారు. ఈ తరహా కార్యక్రమాన్ని అంబేడ్కర్ కోనసీమ జిల్లా మొత్తం విస్తరింప చేయాలని, ఇందుకోసం అవసరమైన సీఎస్సార్ నిధులను ప్రభుత్వ పరంగా తామే సమకూరుస్తామని యూనివర్శిటీ యాజమాన్యానికి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ మహిళ కోసం ఉపాధి శిక్షణ కార్యక్రమాలకు తాము సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. రాజోలు నియోజకవర్గంలో పది లేస్ బిల్డింగులు ఉన్నాయని, వాటిని ఉపాధి శిక్షణకోసం వినియోగించుకోవాలని సూచించారు. మహిళల ఉపాధిని మెరుగు పరిచేందుకు రాజోలు నియోజకవర్గాన్ని ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే దేవ అభినందించారు. యూనివర్శిటీ ప్రో వైస్‌చాన్సలర్ డాక్టర్ లతీష్‌కుమార్ మాట్లాడుతూ కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఎస్ఆర్ఎం యూనివర్శిటీ సేవా కార్యక్రమాలను కూడా చేపడుతుందన్నారు. యూనివర్శిటీ చైర్మన్ డాక్టర్ పరివేందర్, ప్రెసిడెంట్ పి.సత్యనారాయణలు ఈ తరహా కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన వివరించారు. ఎంపీ, ఎమ్మెల్యేలను యూనివర్శిటీ యాజమాన్యం ఎడ్ల బండ్లను అందించి జ్ఞాపికలను ప్రదానంచేసి సత్కరించారు. ఈ సభ కార్యక్రమం ప్రారంభానికి ముందు ఎంపీ, ఎమ్మెల్యేలు మోరి మిషనరీ కార్యక్రమాలను ప్రారంభించారు. అథిత్రి కార్యక్రమానికి ఎంపికైన 33 గ్రూపులకు రూ.68లక్షల విలువైన మిషనరీని అందించారు. కార్యక్రమంలో యూనివర్శిటీ డైరెక్టర్లు డాక్టర్ సిద్ధార్థ త్రిపాఠి, అనూప్ సింగ్‌సూర్యవంశీ, ఉదయన్ భక్షి, అథిత్రి సభ్యులు స్వాతి, రత్నకిశోర్, సునీల్, స్థానిక నాయకులు ముప్పర్తి నాని, చాగంటి స్వామి, దిరిశాల బాలాజీ, వీరా మల్లిబాబు, గుబ్బల ఫణికుమార్, కూటమిశ్రేణులు, సఖినేటిపల్లి మండల మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో 75శాతం పుస్తకాలు సరఫరా

● సమగ్రశిక్షా జిల్లా సీఎంవో సుబ్రహ్మణ్యం

మామిడికుదురు, మే 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలను 75శాతం సరఫరా చేసినట్టు సమగ్రశిక్షా జిల్లా సీఎంవో డీవీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. లూటకుర్రు స్కూలులో గల పుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఆయన మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 22 మండలాలకుగాను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా బొమ్మూరు కేంద్రం నుంచి టెక్స్ట్ పుస్తకాలతోపాటు వర్క్ పుస్తకాలు 75శాతం సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. మిగిలిన 25 శాతం పుస్తకాలను త్వరలోనే సరఫరా చేయనున్నట్టు తెలిపారు. ఈ సంవత్సరం 6వ తరగతికి 40 రోజులు సంసిద్ధత కార్యక్రమం అమలు చేస్తున్నట్టు, దానికిగాను రెండు ప్రత్యేక పుస్తకాలు ఇంగ్లీషు, తెలుగు సబ్జెక్టులు 1, గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రం కలిపి మరొకటిగాను అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, సీఆర్పీలు పాల్గొన్నారు.


లూటుకుర్రులోని పుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష సీఎంవో సుబ్రహ్మణ్యం

మెగా జాబ్ మేళాకు 427 మంది ఎంపిక



రాజోలులో మాట్లాడుతున్న అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్

రాజోలు, మే 6(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికాస, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ఏ1 సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా జాబ్‌మేళాను మంగళవారం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అమలాపురం ఎంపీ హరీష్‌కుమార్ మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. దాదాపు 10వేల మందికిపైగా యువతకు ఉద్యోగ అవకాశాలు అందించేందుకు ప్రతీరోజు పనిచేస్తున్నామని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశ్యంతో ఈ మెగా జాబ్‌మేళా నిర్వహించి యువతకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. ఏ1 సేవాసమితి అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను మాట్లాడుతూ నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాకు 923 మంది నిరుద్యోగులు హాజరు కాగా 37 కంపెనీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించగా 427 మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి, దిరిశాల బాలాజీ, మానుకొండ దుర్గాప్రసాద్, మంగెన భూదేవి, సర్పంచ్ రేవు జ్యోతి, మోకా పార్వతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సాయిబాబు, స్వామి పాల్గొన్నారు.

స్వామివారి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

అంతర్వేది, మే 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో రాష్ట్ర బీజేపీ కార్యాలయ బిల్డింగ్ సెల్ కార్యవర్గ సభ్యులు గట్టి సత్యనారాయణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మంగళవారం స్వామిని దర్శించుకున్నారు. అంతర్వేది దేవస్థానం భూములపై దేవస్థానం అధికారులు ఇతర డిపార్టుమెంట్‌లతో చేస్తున్న సర్వే దేవస్థానం భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణతో చర్చించి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వేసవి కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున దేవాలయ పరిసరాల్లో ఎండ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, కాలినడకన నడిచేవారికి మేట్లు వేయాలని జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోతురాజు సురేష్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, కాపిశెట్టి కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

యానాం, మే 6(ఆంధ్రజ్యోతి): యానాం విద్యాశాఖ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న స్మార్ట్ స్కూల్ అభివృద్ధి పనులను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అధికారులతో కలిసి పరిశీలించారు. సీఎస్ఆర్ నిధులతో ఈ స్మార్ట్‌స్కూల్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభమ్యేనాటికి అభివృద్ధి పనులు పూర్తిచేయాలని ఒక్కొక్క పాఠశాలకు సుమారు రూ.35లక్షల నుంచి 40లక్షల వరకు ఖర్చుచేసి స్మార్ట్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటు, అత్యాధునిక టెక్నాలజీతో విద్యాబోధన పర్నీచర్ తదితర ఏర్పాట్లు చేస్తారు.

యానాంలో ఉమెన్ కమిషన్ సభ్యుల పర్యటన

యానాం, మే 6(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో పుదుచ్చేరికి చెందిన ఉమెన్ కమిషన్ సభ్యులు బృందం పర్యటించారు. రెండురోజుల పర్యాటనలో భాగంగా వీరు యానాం వచ్చారు. ఈసందర్భంగా కమిషన్ చైర్‌పర్సన్ నాగజ్యోతి, సభ్యులు సుజాత, అంబరాశి, చంద్రలు పరిపాలనాధికారి మునిస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇరువురు సత్కరించుకున్నారు. యానాం పర్యటనకు సంబంధించిన అంశాలపై ఆర్ఏతో చర్చించారు.

వైభవంగా సోమాలమ్మ తీర్థం



ఉప్పలగుప్తం, మే 6(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం గ్రామదేవత సోమాలమ్మతల్లి తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు చెల్లించుకున్నారు. రాత్రి జబర్దస్త్ కళాకారుల హాస్య ప్రదర్శన, సినీ, టీవీ ఆర్టిస్టుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

భూముల సర్వే వేగవంతం చేయాలి


లక్ష్మీనరసింహస్వామి, శివాలయం భూముల సర్వే పనులపై ఆరా తీస్తున్న ఆర్డీవో మాధవి

అంతర్వేది, మే 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి, క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామివారి ఆలయ భూముల్లో చేస్తున్న సర్వే పనులు ఎంత వరకు వచ్చాయని అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆలయ అధికారులను అడిగారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ఆలయ అధికారులు, ఇతర అధికారులతో కలిసి భూముల సర్వే కొలతలను పరిశీలించారు. భూముల ప్రస్తుత స్వభావం, పంటలు, చెరువులు, నిర్మాణాలు, వాటి వివరాలు సేకరించారు. సర్వే చేస్తున్న బృందాల పనితీరు, పురోగతిని తెలుసుకున్నారు. కేశవదాసుపాలెంలో కొన్ని దేవస్థానం భూములను పరిశీలించారు. దేవస్థానం భూముల్లో చెరువులు, ఇళ్లు, ఇతర నిర్మాణాలను పరిశీలించిన అనంతరం పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, రెవెన్యూ, వ్యవసాయ, ఫిషరీస్, మత్స్యశాఖ, ఇతర అధికార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలి'

ముమ్మిడివరం, మే 6(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులందరూ ఇ-శ్రమ ఇన్సూరెన్సు నమోదు చేసుకున్నా ఇప్పటివరకు మృతి చెందిన కార్మికులకు ఇన్సూరెన్సు క్లయిమ్ కాకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ ఆరోపించారు. ముమ్మిడివరంలో ఏరియా ముఠా జట్టు వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం విత్తనాల ఏడుకొండలు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 2022లో మృతి చెందిన కార్మికులకు ఇప్పటి వరకు ఇన్సూరెన్సు క్లయిమ్ కాకపోవడం విచారకరమన్నారు. 2023-24-25సంవత్సరాల్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్న అనేకమంది కార్మికులు ఇ-శ్రమ ఇన్సూరెన్సు చేయించుకున్నా వారు రోడ్డు యాక్సిడెంట్‌లో మృతి చెందినా వారి కుటుంబాలకు ఇన్సూరెన్సు ఇప్పటివరకు మంజూరు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన కార్మిక కుటుంబాలు ఇన్సూరెన్సు కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. తక్షణం 2025 వరకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వివిధ రంగాల్లోని కార్మికులకు ప్రమాద బీమా ఇన్సూరెన్సు తక్షణం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు లేబర్ కోడ్‌కు వ్యతిరకంగా చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ముమ్మిడివరం ఏరియాలో ఉన్న ముఠా జట్టు కార్మికులందరూ సమ్మెలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సమ్మెకు కార్మికులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. రాయుడు వీర్రాజు, వేగిరాజు శ్రీనివాస్‌రాజు, అయినాపురపు గవరరాజు, విత్తనాల దుర్గారావు, కొప్పిశెట్టి గణేష్, మాగాపు గోవిందు, దూనబోయిన కృష్ణ పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

మలికిపురం, మే 6(ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. మండల పరిధిలోని బట్టేలంక, పడమటిపాలెంలో జరిగిన కిశోరి వికాసంలో భాగంగా కిశోరి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు తద్వారా సంభవించే దుష్పరిణామాల గురించి వివరించారు. అదేవిధంగా మోరిలో జరిగిన కిశోరి వికాసం కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకళ మాట్లాడుతూ యుక్త వయసు నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలన్నారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు ప్రసన్నరాణి, సరోజిని, హైమావతి, చంద్రకళ, మున్నీసా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.పద్మావతి, కె.జ్యోతి, శేషవేణి, ఏఎన్ఎం కీర్తి, మహిళా పోలీసులు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు కృషిచేయాలి


అల్లవరంలో ఎంపీడీవో కృష్ణమోహన్‌ను సన్మానిస్తున్న కార్యదర్శులు

అల్లవరం, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీల్లో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీలను ప్లాస్టిక్ వాడకం లేని గ్రామాలుగా తీర్చిదిద్ది ప్రజారోగ్యాన్ని కాపాడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పనితీరు మెరుగుదల, ఒత్తిడి నివారణం వంటి వాటిపై ఆన్‌లైన్ శిక్షణ పోర్టల్ కర్మయోగిలో 1781 పాయింట్లు 415 సర్టిఫికెట్లతో 8లక్షల 50వేల మందిలో ప్రథమ స్థానం సాధించిన ఎంపీడీవో కృష్ణమోహన్‌ను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఎస్.రాజమోహన్, కృష్ణ, ఆదిశంకరం, జ్యోతి, రమణమ్మ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి'


శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ దుర్గారావుదొర

ముమ్మిడివరం, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పీహెచ్‌సీల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావుదొర పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ నివేదిక శిక్షణ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజల ఆరోగ్య విషయాలపై సమగ్ర వివరాలు సేకరించి వారికి అందించిన సేవలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పీహెచ్‌సీల ద్వారా బాలింతలకు, గర్భిణులు, చిన్నపిల్లలకు అందిస్తున్న సేవలపై వారికి అవగాహన కల్పించి వాటిని వారు సక్రమంగా వినియోగించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఎటువంటి రోగాల బారిన పడకుండా అవసరమైన మందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఫార్మాశిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, సూపర్‌వైజర్లు, హెచ్ఎంఐఎస్ నోడల్ ఆఫీసర్లకు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.సత్యనారాయణ, జిల్లా ప్రోగ్రాం మోనిటరింగ్ అధికారి డాక్టర్ టీకే శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ ఎం.సుమలత, జిల్లా స్టాటికల్ ఆఫీసర్ కె.వీరబాబు, డీపీవో రవిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

బౌద్ధ స్థూపం వద్ద బుద్ధ పౌర్ణమి ఉత్సవాలు

మామిడికుదురు, మే 6(ఆంధ్రజ్యోతి): ఆదుర్రులోని ఆదిబౌద్ధ స్థూపంవద్ద భారతీయ వారసత్వ సాంస్కృతిక బౌద్ధ ఉత్సవాలు ఈనెల 18 నుంచి నిర్వహించనున్నట్టు బుద్ధవిహార్ ట్రస్టు అధ్యక్షుడు ఎస్ఎస్సార్ భూపతి తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం బౌద్ధ స్థూపంవద్ద ఆవిష్కరించారు. ప్రతీ సంవత్సరం బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఉత్సవాలకు బుద్ధిస్టులు, అంబేడ్కర్ అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, వెంకట్రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

ముమ్మిడివరం, మే 6(ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘనాయకులు డిమాండ్ చేశారు. వారంతా మంగళవారం సంఘ అధ్యక్షుడు పెట్టా శివప్రసాద్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మకు వినతిపత్రం అందించారు. ఆప్కాస్ రద్దు చేయవద్దని, ప్రైవేట ఏజెన్సీలను అనుమతించవద్దన్నారు. తమ డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఈనెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజులపాటు సమ్మె చేయనున్నట్టు వారు వివరించారు. పెట్టా శివప్రసాద్, మొక్కవెల్లి శ్రీనివాసరావు, నక్కా అరుణ్‌కుమార్, ఆర్.అరుణ, వి.వెంకటేశ్వర్లు, జి.రమేష్, పి.రవీంద్ర పాల్గొన్నారు.

ఘనంగా చింతాలమ్మ తీర్థం

అంబాజీపేట, మే 6(ఆంధ్రజ్యోతి): మొసలపల్లి గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి తీర్థం మంగ ళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారంరాత్రి నిర్వహించిన జాతరలో గరగనృత్యాలు, కోయడ్యాన్సులతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, మే 6(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. మంగళవారం స్థానిక బండారు బల్లిసత్యం, చంద్రావతి కల్యాణ మండపంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లోవోల్టేజీ సమస్యపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రతి ఒక్క అధికారి తమశాఖ పరిధిలో ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, అయినవిల్లి సత్తిబాబుగౌడ్, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒక్కరోజు ఆదాయం రూ.2.84 లక్షలు

ఆత్రేయపురం, మే 6(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,84,421 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన మండవిల్లి శ్రీరామచంద్రమూర్తి, పద్మిణి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.54,199 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఈవో స్వామివారి చిత్రపటం అందచేశారు.

కేశవరంలో మహిళ దీక్షకు యువకుల మద్దతు


శ్రీవాణికి సంఘీభావం తెలుపుతున్న ద్వారపూడి యువకులు

మండపేట, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వల్లూరి శ్రీవాణి శాంతియుత దీక్ష మంగళవారంతో 19వ రోజుకు చేరింది. ఆమె దీక్షకు ద్వారపూడి గ్రామానికి చెందిన పలువురు యువకులు సంఘీభావం తెలిపారు. మంగళ వారం ద్వారపూడికి చెందిన జి.దుర్గా సాయి, ఎన్.సతీష్, శ్రావణం, బలగల జగదీష్, పి.దుర్గా ప్రసాద్, మణికంఠ, శ్రీను కుమార్ తదితరులు మద్దతు తెలిపారు. ఆమె దీక్షకు స్థానికుల నుంచి మద్దతు లేకపోవడం బాధాకరమని పలువురు యువకులు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హైస్కూల్ గోడ నిర్మాణానికి ప్రైవేటు సంస్థ అందించే ఆర్థికసాయంతో రాజకీయాలకు అతీతంగా అంతా కలిసి రావాలని పలువురు కోరుతున్నారు.

ప్రైవేట్ పాఠశాలల రికార్డుల పరిశీలన

రావులపాలెం, మే 6(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని పలు ప్రైవేట్ పాఠశాలల రికార్డులను డీఈవో షేక్ సలీంబాషా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య, నారాయణ, శ్రీవాగ్దేవి, వివేకానంద, శ్రీసూర్యస్ బ్లూవింగ్ బడ్స్ పాఠశాలలను సందర్శించి రికార్డులను ఆయన పరిశీలించారు. పాఠశాలలకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఈతకోట పరిధిలో ఉన్న శ్రీ సూర్యస్ బ్లూవింగ్ బడ్స్ స్కూల్ గతంలో లిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌గా రావులపాడు పరిధిలో ఉండేదని ప్రస్తుత పాఠశాల నిర్వాహకులు ఆయనకు తెలిపారు.


రావులపాలెం శ్రీచైతన్య పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో సలీంబాషా


చొప్పెల్లలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆరోగ్య సిబ్బంది

విలేజ్ క్లినిక్ సీహెచ్‌వోలు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

ఆలమూరు, మే 6(ఆంధ్రజ్యోతి): చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ క్లినిక్)లో మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్‌వోలు ఇటీవల నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా తమ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు హేళనగా మాట్లాడారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా పీహెచ్‌సీలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసన ప్రదర్శనలో పెదపళ్ళ, చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికా వికాసంపై అవగాహన


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ మీనాకుమారి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి తదితరులు

కపిలేశ్వరపురం, మే 6(ఆంధ్రజ్యోతి): వల్లూరు గ్రామ సచివాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కిషోర్‌బాలికా వికాసం 2 వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి.మీనాకుమారి, మహిళా పోలీస్ జి.ప్రమీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషోర బాలికలకు రుతుస్రావం, వ్యక్తిగత శుభ్రత, లైంగికవిద్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె.సత్తిబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.విజయకుమారి, ఎస్ఎల్ చిరంజీవి, వై.యర్రాయమ్మ, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా పల్లాలంబిక అమ్మవారి జాతర



కపిలేశ్వరపురం, మే 6 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చినకోరుమిల్లి గ్రామంలో కొలువై యున్న పల్లాంబిక అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గరగ నృత్యా లు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారిని పెదకోరుమిల్లి గ్రామంలోని మహాలక్ష్మమ్మ ఆలయం నుంచి చినకోరుమిల్లిలోని పల్లాంబిక ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. గ్రామస్తులు దారిపొడవునా అమ్మవారికి చీరలు, రవిక, గాజులు, పూలు, నైవేద్యాలు, సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారికి పలువురు ప్రత్యేక పాన్పు ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు వేలాదిగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అంగర ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

నేడు వాసవీమాత జయంతి

మండపేట, మే 6(ఆంధ్రజ్యోతి): మండపేటలో వున్న వాసవీమాత జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని గ్రామోత్సవం, ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశామని నిర్వాహకులు చెప్పారు. అమ్మవారి జయంతి వేడుకల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

11న జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 6(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఉపాధి కార్యాలయంలో ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, బీటెక్ చదివిన 18 నుంచి 26 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన వ్యక్తులు శ్రీసిటీ, తడ, తిరుపతిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వీరికి రూ.14,800 నుంచి రూ.17,600 వరకు జీతం ఇస్తారని షిఫ్ట్ సమయంలో భోజన, రవాణా సదుపాయం ఉంటుందన్నారు. అనంతపురం జిల్లా పెనుగొండ కియా మోటార్స్ అండ్ క్వాలిటీ విభాగంలో ఆపరేటర్లుగా పనిచేసేందుకు ఎంపికలు చేస్తామన్నారు. ఈ ఎంపికలకు 18 నుంచి 35 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. హైదరాబాద్‌లో హెటిరో ల్యాబ్‌లో జూనియర్ ఆపరేటర్, కెమిస్ట్, ఇంజనీర్ ట్రైనీ నియామకాలు జరుపుతారన్నారు. వివరాలకు 95154 81671లో సంప్రదించాలని కోరారు.


ప్రత్యేక అలంకరణలో ఉన్న బాలాత్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి (ఫైల్‌ఫొటో)

8 నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

రాయవరం, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీబాలాత్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఈవో జి.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు ధ్వజారోహణం అనంతరం నంది వాహనం ఊరేగింపు ఉంటుందన్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణం జరుగుతుందన్నారు. ఈనెల 9న సదస్యం, 11న సోమేశ్వరస్వామి రథోత్సవం, 12న త్రిశూలస్నానం, 13న శ్రీపుష్పయాగం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

భార్యపై దాడికి పాల్పడిన భర్త అరెస్టు

రాయవరం, మే 6(ఆంధ్రజ్యోతి): భార్యపై కత్తితోదాడి చేసిన భర్తను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సోమేశ్వరం గ్రామానికి చెందిన దూలం సత్యకుమారికి ఆమె భర్త శ్రీనుకు మూడు నెలల నుంచి కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 4న శ్రీను భార్యపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి 5న నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. సోమవారం అనపర్తి జేఎఫ్‌సీఎం ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.


క్యాన్సర్ బాధితుడికి ప్లేట్‌లెస్ అందించిన ఉపాధ్యాయుడు

క్యాన్సర్ బాధితుడికి ప్లేట్లెస్ దానం

ఆత్రేయపురం, మే 6(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం బుల్లియ్యరేవు పాఠశాల ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల సుధాకరబాబు ప్లేట్‌లెస్ దానం చేశారు. ఆలమూరు మండలం చింతలూరుకు చెందిన ఆరేళ్ళ బాలుడికి క్యాన్సర్ చికిత్స నిమిత్తం దీన్ని దానం చేశారు. ఈయన ప్లేట్లెస్ దానం చేయడం ఇది రెండోసారి. ఆయన్ను పలువురు యూటీఎఫ్ నాయకులు అభినందించారు.

సారాతో ఇద్దరి అరెస్ట్

కొత్తపేట, మే 6(ఆంధ్రజ్యోతి): రామారావుపేటకు చెందిన అప్పారి శ్రీనివాసరావు, రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన ఐనం రామును అరెస్టు చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు కూలీల కొరత

• ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని రైతుల విజ్ఞప్తి • చోద్యం చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

మండపేట, మే 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులకు కూలీలు దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 1.50లక్షల ఎకరాల్లో వరితో పాటు ఉద్యాన పంటల సాగు కూడా అధికంగా ఉంటుంది. వ్యవసాయ పనులకు కూలీల కొరత వస్తుండటంతో వ్యవసాయం భారంగా మారిందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. రైతులకు బాసటగా వ్యవసాయానికి ఉపాధి హామీని అనుసంధానం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినా అమలుకు నోచుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తారన్న ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. ఉపాధి పథకం పనులపై కూలీలు చూపిస్తున్న శ్రద్ధ వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదన్న ఆరోపణలున్నాయి. ఉపాధి హామీలో మస్తరు వేయించుకుంటే నేరుగా కూలీసొమ్ములు బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఖాతాలో పడు తుంది. వ్యవసాయానికి ఉపాధి హామీని అను సంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ కమిటీకి సిఫార్సు చేసింది. వ్యవసాయ పనుల్లో 75 శాతం కూలిరైతు, 25 శాతం మేర ఉపాధి నిధుల ద్వారా కూలీల ఖర్చులను భరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఖర్చును భరించి పథకాన్ని అమలు చేయాలని కమిటీ తమ నివేదికలో పేర్కొంది. వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తే ఖర్చులో 25శాతం మేర మిగులుతుందని కూలీ లకు సైతం పనిలభ్యం అవుతుందని రైతులంటున్నారు. వచ్చే ఏడాది నుంచైనా ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.


పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తున్నారు

రావులపాలెం, మే 6(ఆంధ్రజ్యోతి): రావులపాలెం పంచాయతీ పరిధిలో వచ్చే ఫిర్యాదులపై కార్యదర్శి అలసత్వం వహిస్తున్నారని బీజేపీ రాష్ట్ర పదాధికారి, గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ తమలంపూడి రామకృష్ణారెడ్డి అన్నారు. రావులపాలెం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ గ్రామసభ తీర్మానాలను ముందుగా రిజిష్టర్‌లో రాసి సంతకాలు తీసుకోవల్సి ఉండగా గ్రామ సభ తీర్మానించిన తీర్మానాలను రిజిష్టర్‌లో రాయకుండా సంతకాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలు, కట్టడాలపై ఫిర్యాదులు అందినప్పటికి చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. స్వచ్ఛ భారత్ నిధులు తదితర నిర్వహణపై ఫిర్యాదు చేస్తే పరిష్కారం కాకుండానే పరిష్కరించిన్నట్లు చూపించారని ఆరోపించారు. దీనిపై ఈవోపీఆర్డీ జి.కృష్ణను వివరణ కోరగా గ్రామసభలో తీర్మానాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే నోటీసులు ఇచ్చామని స్వచ్ఛభారత్‌కు సంబంధించి నిధులు రాలేదన్నారు. కార్యక్రమంలో ఉమ్మిడిశెట్టి వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణారెడ్డి, శ్రీరామ్, రామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట

మండపేట, మే 6(ఆంధ్రజ్యోతి) మండపేట మున్సిపల్ కార్యాలయం ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే సమ్మెబాట పడతామని తాత్కాలిక ప్రాతిపతికన పనిచేసే సిబ్బంది మంగళవారం కమిషనర్ రంగారావును కలిసి సమ్మె నోటీసు అంద జేశారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే ఒప్పంద కార్మికుల సంఘ అధ్యక్షుడు పాలపర్తి సుబ్బరాజు సారథ్యంలో తమ డిమాండ్‌లను కమిషనర్‌కు వివరించారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 7నుంచి సమ్మె చేపడతామని వారన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని కమిషనర్ కార్మికులకు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు తాతారావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

కె.గంగవరం, మే 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల అకాల వర్షాల కారణంగా వరి రైతులకు జరిగిన నష్టానికి ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని భారతీయ జనతా పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. పామర్రు ఉన్నత పాఠశాల ఆటస్థలంలో వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని వారు మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టడం వల్ల కూలీల ఖర్చు ఎక్కువ అవుతుందన్నారు. ప్రభుత్వం రంగుమారిన, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు, ఏవీ రమణ మూర్తి, నున్న సత్యనారాయణ, ఏ. నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు


రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్‌కు జట్ల ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ఈనెల 15 నుంచి 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి 10వ సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జట్లు మంగళవారం ఎంపిక చేశారు. ఎంపిక పోటీలు స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా మైదానంలో జరిగాయి. ఎంపిక పోటీలకు 118 మంది బాలురు, 86 మంది బాలికలు పాల్గొన్నారు. బాలురు నుంచి 24 మందిని, బాలికలను నుంచి 24 మందిని ఎంపిక చేశారు. శిక్షణలో ప్రతిభ కనపరిచిన వారిని బాలుర నుంచి 12 మందిని, బాలికల నుంచి 12 మందిని తుది జట్టుకు ఎంపిక చేస్తామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గన్నమని చక్రవర్తి తెలిపారు.

సిరికాలి అకాడమీకి 18 మంది ఎంపిక: తమిళనాడులో వివేకానంద అండ్ గుడ్ సమాఖ్య గ్రూపు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సిరికాలి బాస్కెట్‌బాల్ అకాడమీకి 18 మంది ఎంపికైనట్లు గన్నమని చక్రవర్తి తెలిపారు. ఎంపికలకు 41 మంది విద్యార్థులు హాజరుకాగా 18 మందిని ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా బాస్కెట్‌బాల్ శిక్షణతోపాటు, ఉచిత విద్య, భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామని అకాడమీ సీఈవో ప్రవీణ్ వంసత్ నమాజ్ తెలిపారు. కార్యక్రమాల్లో రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ తరపున పోలిశెట్టి రాంబాబు, జీఎస్‌వి బాబు, గొల్లపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాశంపై శిక్షణ తరగతులు

రాయవరం, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక, నదురుబాద గ్రామాల్లో మంగళవారం కిశోరి వికాశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో ఎ.జగలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాయవరం సెక్టార్ సూపర్‌వైజర్ సునిత పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళా కార్యదర్శి లక్ష్మి సురేఖ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు చట్టాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోరి బాలికలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రాయవరంలో కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాజ్యసభ ఎంపీకి అభినందనలు

ఆత్రేయపురం, మే 6(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఉప ఎన్నికల్లో ఏపీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక వెంకట సత్యనారాయణను, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి భీమవరంలోని ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయం క్రమశిక్షణ, విధేయతకు పట్టం గట్టిందన్నారు. బీసీలకు బీజేపీ రాజ్యసభ స్థానం కల్పించి సముచిత ప్రాధాన్యం కల్పించిందని ఆమె తెలిపారు.


కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉచిత కంటి వైద్య శిబిరం

ఆత్రేయపురం, మే 6(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మహాత్మాగాంధీ విద్యా సంస్థలలో మంగళవారం పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సెక్రటరీ, కరస్పాండెంట్ పీఎస్ రాజు ప్రారంభించారు. డెంటల్, నేత్ర ఆసుపత్రి వైద్యులు 200 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీవీఆర్, పెన్షనర్ల సంఘ నాయకులు వీరభద్రరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు

ఆలమూరు, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులకు మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా పరీక్షలు చేశారు. రాజమహేంద్రవరంకు చెందిన శ్రీభాను తేజస్ మల్టీస్పెషాలిటీస్ హాస్పటల్, రేవతి ఆసుపత్రి, డాక్టర్ మోహన్ డయాబెటిక్ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం, రమా దంత వైద్యశాల ఆసుపత్రి వైద్యులు పలు పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 152 మంది ఉద్యోగులకు పరీక్షలు చేశారు.


ప్రచార పత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రభుత్వ జూనియర్ కాలేజీలను సద్వినియోగం చేసుకోవాలి డీఐఈవో సోమశేఖర్

ఆలమూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నైపుణ్యం కలిగిన అధ్యాపకులతోపాటు అనేక సౌకర్యాలు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీఐఈవో వనుము సోమశేఖర్ కోరారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజిని మంగళవారం ఆయన సందర్శించారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ప్రచార పత్రాలను ఆయన ఆవిష్కరించారు, విద్యార్థినులకు మలబార్‌గోల్డ్ సంస్థ అందించే సీఎస్ఆర్ మెరిట్ స్కాలర్ సదుపాయం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి, పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

చలివేంద్రం ప్రారంభం

మండపేట, మే 6(ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకుని మండపేటలోని కరాచీ సెంటరులో వున్న నాళం భీమయ్య సత్రంలో మంగళవారం చలివేంద్రాన్ని సత్రం చైర్మన్ నాళం కిట్టు ప్రారంభించారు. ప్రతి ఏటా వేసవిలో దీన్ని ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీరుస్తున్నట్టు చెప్పారు.